జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 12, ఫిబ్రవరి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

# ఏబీవీ.. ఎందుకలా?

- ఏబీవీ ఆ పదవి ఎందుకు వద్దంటున్నారు?
- పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమాకం
- ఉత్తర్వులు ఇచ్చి పదిరోజులు దాటినా ఇంకా చార్జి తీసుకోని ఏబీ వెంకటేశ్వరరావు
- ఆ కార్పొరేషన్‌కు ఇన్చార్జి ఎండిగా ఐజి మోహన్‌రావు
- డీజీ స్థాయిలో రిటైరయిన ఏబీ వెంకటేశ్వరరావు
- ఐజి కింద డీజీ పనిచేస్తారా అంటున్న టీడీపీ సోషల్‌మీడియా దళాలు
- ఏబీవీకి ఎండితోపాటు, క్యాబినెట్ ర్యాంక్ ఇవ్వాలంటున్న పార్టీ సీనియర్లు
- జగన్ కేసులు సహా వైసీపీ కేసులు ఆయనకే అప్పగించాలంటున్న పార్టీ నేతలు
- ఆ పర్యవేక్షణ లేకనే వైసీపీ నేతలుతప్పించుకుంటారన్న వ్యాఖ్యలు
- వైసీపీ నేతలపై చర్యలు తీసుకోకపోవడంపై పార్టీలో పెరుగుతున్న అసంతృప్తి
- వీటికి ఏబీని ప్రయోగించడమే రైటు అంటున్న పార్టీ వర్గాలు



## కామెంట్



(మార్తి సుబ్రహ్మణ్యం)

జగన్‌పై నదురు బెదురు లేకుండా ఐదేళ్లు న్యాయసమరం చేసి.. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని ఒక్కసారి కూడా కలవని డీజీగా చరిత్ర సృష్టించిన మాజీ డీజీ ఏబీ వెంకటేశ్వరరావుకు.. ప్రభుత్వం అప్పగించిన పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిలో ఇప్పటివరకూ ఎందుకు చేరలేదు? చార్జి తీసుకునేందుకు ఆయన ఎందుకు ఆసక్తి ప్రదర్శించడం లేదు? దానిపై ఆయన తన మిత్రులు, శ్రేయోభిలాషుల సలహాలు ఇంకా ఎందుకు తీసుకుంటున్నారు? అసలు ఏబీ కోరుకున్నదేమిటి? సర్కారు ఇచ్చిందేమిటి? ఆ తరహా పదవిని ఏబీ కోరుకున్నారా? లేక సర్కారు కూడా ఏదో ఇవ్వాలి కాబట్టి ఇచ్చినట్లు చేసిందా? లేక ఈ విషయంలో చంద్రబాబును ఏ అధికారయినా తప్పుదోవపట్టించారా? అసలు ఏబీ ఎందుకు ఆ పదవి తీసుకోవడం లేదు?.. ఇదీ ఇప్పుడు పోలీసు,రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్.

మాజీ డీజీ ఏబీ వెంకటేశ్వరరావును ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా నియమిస్తూ, ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం ఉత్తర్వులిచ్చింది. అదే సమయంలో మాజీ డీజీపీ ఠాకూర్‌ను ప్రభుత్వ సలహాదారుగా నియమించి, ఆయనను ఢిల్లీలోని ఏపీభవన్‌కు ఇన్చార్జిగా నియమించిన విషయం తెలిసిందే.

అందులో ఏబీ ఐదేళ్ల జగన్ హయాంలో వేధింపులు ఎదుర్కొన్న అధికారి. కాగా ఠాకూర్ ఆర్టీసీ ఎండిగా పదవీవిరమణ చేసిన తర్వాత, జగన్ ప్రభుత్వం ఆయనను విజిలెన్స్ కమిషనర్‌గా నియమించింది. అంటే ఎన్నికలకు కొద్దినెలల ముందు వరకూ ఠాకూర్, వైసీపీ సర్కారులో అన్ని అధికారాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా అనుభవించారన్నమాట.

కూటమి సర్కారు వచ్చిన తర్వాత.. పార్టీ కోసం కష్టపడిన పోలిట్‌బ్యూరో సభ్యుడు టిడి జనార్దన్, మాజీ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు, వైసీపీపై యుద్ధం ప్రకటించి జగన్‌తో చావోరేవో తేల్చుకున్న మాజీ ఎంపి, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుకు మంత్రి పదవి, ఇతరులకు సలహాదారు పదవులిచ్చి కూటమి సర్కారు అందలమెక్కిస్తుందని పార్టీ వర్గాలు అంచనా వేశాయి. ఎందుకంటే విపక్షంలో వారు పోషించిన పాత్ర అలాంటిది కాబట్టి!

ఇక చంద్రబాబు వద్ద సుదీర్ఘకాలం పీఎస్‌గా పనిచేసిన పెండ్యాల శ్రీనివాసరావును జగన్ ప్రభుత్వం వెంటాడింది. సస్పెండ్ చేసింది. ఐటికి ఫిర్యాదు చేసింది. ఆయన ఇంటిపై ఐటి దాడులు చేసింది. పోలీసులు శ్రీనివాస్ ఇంటికి అర్ధరాత్రి వెళ్లి మరీ వేధించేవారు. దానితో జగన్ వేధింపులకు తాళలేక, ఏడాదిన్నరపాటు అజ్ఞాతంలోకి వెళ్లాల్సిన విషాదం. శ్రీనివాస్‌ను అరెస్టు చేసి, ఆయన ద్వారా చంద్రబాబును ఇరికించాలన్నది నాటి జగన్ సర్కారు అసలు లక్ష్యం.

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత శ్రీనివాస్‌ను పిలిచి పెద్దపీట వేస్తారని పార్టీ సీనియర్లు భావించారు. ఎందుకంటే ఆయన సుదీర్ఘకాలం చంద్రబాబు వద్ద వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేశారు మిగతా.. 2లో








## ఫైళ్ల క్లియరెన్సులో
# స్పీడ్ పెరగాలి

- ఆర్థికేతర ఫైళ్లు పెండింగ్‌లో ఉండకూడదు
- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశం

**అమరావతి, మహానాడు:** ఈ-ఆఫీసులో ఫైళ్ల క్లియరెన్సు ప్రక్రియ వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో జరిగిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో భాగంగా వివిధ శాఖల్లో ఈ-ఆఫీసు ఫైళ్ల క్లియరెన్సు జరుగుతున్న క్రమం గురించి మంగళవారం ఆర్టీజీఎస్ సీఈఓ కె. దినేష్ కుమార్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీసులో ఫైళ్లు క్లియరెన్సులో వేగం మిగతా.. 2లో

## నకిలీ విత్తనాల వ్యాపారంపై ఉక్కుపాదం మోపండి

- వ్యవసాయ శాఖ ఎక్స్‌అఫిషియో స్పెషల్ సీఎస్‌ను ఆదేశించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, మహానాడు:** రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించే నకిలీ విత్తనాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, వాటి ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ విధానాన్ని పటిష్ఠంగా అమలు పర్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో మిగతా.. 2లో

## వాట్సాప్‌లోనే అన్ని ధ్రువపత్రాలిస్తాం

- క్యూఆర్ కోడ్ సహిత డిజిటల్ రేషన్ కార్డులివ్వబోతున్నాం
- శాఖలన్నీ డేటా లేక్‌తో అనుసంధానం కావాలి
- ఐటీ, ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడి



**అమరావతి, మహానాడు:** వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు కావాల్సిన అన్ని రకాల ధ్రువపత్రాలు పొందేలా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ,ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ప్రజలకు సీమ్‌లెస్ సర్వీసులు అందజేయాలన్నదే తమ ఆశయమన్నారు. మంత్రులు, కార్యదర్శుల సదస్సులో భాగంగా ఆయన వాట్సాప్ గవర్నెన్స్ గురించి మాట్లాడారు. వాట్సాప్ గవర్నెన్స్ అనేది ప్రజలకు మనం కల్పిస్తున్న ఒక మంచి వేదికని దాన్ని మరింత ప్రజోపయోకరంగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించి ఆయా శాఖలన్నీ కూడా తమ డేటాను ఆర్టీజీఎస్‌లోని డేటా లేక్‌కు అనుసంధానం చేసి సహకారం అందివ్వాలని కోరారు.

వాట్సాప్ ద్వారా సర్టిఫికెట్లు జారీ చేయాలంటే ఆయా శాఖల సహకారం చాలా అవసరమన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చాలా కీలక ప్రక్రియ అన్నారు. అధికారులు తమ శాఖల్లో ఈ దిశగా సాంకేతికపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వంలో అన్ని సేవలు ఆన్‌లైన్ చేయాలన్నదే ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమ న్నారు. రేషన్ కార్డుల మొదలు అన్నీ కూడా ప్రజలకు చాలా సులభంగా ఆన్‌లైన్‌లోనే అందించే దిశగా దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో పౌరులకు డిజిటల్ రేషన్ కార్డులు అందజేస్తామని, తద్వారా పౌరులు క్యూ ఆర్ కోడ్ తోనే రేషన్ పొందే సదుపాయం కల్పించే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ప్రజాభిప్రాయాన్ని, ప్రజల సంతృప్తి శాతాలను కూడా వాట్సాప్ ద్వారానే మదింపు వేసే అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు.

అన్ని శాఖలు వాట్సాప్ గవర్నెన్స్‌లో ఇంటిగ్రేటెడ్ అవ్వాలన్నారు. ఒక పౌరుడు ఒక ఆలయానికి వెళ్లాలనుకుంటే వాట్సాప్‌లోనే ఆలయంలో దర్శనం, ఆర్జిసేవలు పొందడ, వసతి పొందడం, ట్రాన్స్‌పోర్టేషన్ అన్నీ కూడా వాట్సాప్‌లో అనుసంధానమవ్వాలన్నారు. ఇవన్నీ చేయాలంటే ఆయా శాఖలు తమ ఐటీ విభాగాలను సాంకేతికంగా మెరుగుపరచుకుని తమకు తగిన సహకారం అందివ్వాలని సూచించారు. అందరి భాగస్వామ్యం, సహకారంతోనే దీన్ని విజయవంతం చేయగలుగుతామన్నారు.




## నా జీవితంలో ఇదే పెద్ద సవాలు

- కార్యదర్శుల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమరావతి, మహానాడు:** 'ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు చేపట్టాను. గత మూడు సార్లు చూడనన్ని సవాళ్లు ఇప్పుడు చూస్తున్నా. అన్ని వ్యవస్థలు విధ్వంసం అయ్యాయి. దెబ్బతిన్న వ్యవస్థలను సరిచేసి ట్రాక్‌లో పెట్టేందుకు ఎఫెక్టివ్‌గా పని చేశాం... ఇక స్పీడ్ పెంచాల్సిన అవసరం ఉంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సచివాలయంలోని ఐదవ బ్లాక్‌లో మంత్రులు, కార్యదర్శులతో మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల పనితీరు, ఫలితాలు, లక్ష్యాలు, ప్రణాళికలపై చర్చించారు.

### ఉత్తమ పాలసీల రూపకల్పన, అమలు బాధ్యత మనదే

2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రాత్మక తీర్పునిచ్చారు. ఎప్పుడూ ఇలాంటి మ్యాండేట్ రాలేదు. గత ఐదేళ్ల విధ్వంస పాలనకు విసుగు చెంది కొత్త ఆశలు, ఆకాంక్షలతో ప్రజలు ముందుకొచ్చి కూటమికి ఘన విజయం అందించారు. వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చాల్సిన బాధ్యత మనపై ఉంది. ప్రతి మూడు నెలకు ఒకసారి కలెక్టర్లతో సమావేశం పెడుతున్నాం. పాలసీలు తయారు చేస్తాం... వాటిని సక్రమంగా అమలు చేయాల్సిన పాలకులుగా మనపై బాధ్యత ఉంది. ఇతరులపై ఆధారపడితే కొత్త ఆలోచనలు రావు. నేను ప్రతి ఒక్కగంటా లెక్కిస్తున్నాను. 90 కేంద్ర ప్రాయోజిత పథకాలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. పథకాల అమలకు ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించారు.

### 15 శాతం వృద్ధి రేటుతో అగ్రభాగాన రాష్ట్రం

స్వర్ణాంధ్ర విజన్-2047ను మీ సహకారంతో విడుదల చేశాం. వికసిత్ భారత్ 2047 ద్వారా ఏం చేయబోతోందో కేంద్రం తెలిపింది. 2047 నాటికి రాష్ట్రం అగ్రభాగాన ఉండేందుకు రాష్ట్రం చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరిస్తూ మనం కూడా డాక్యుమెంట్ విడుదల చేశాం. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నాం. సమర్ధవంతమైన నాయకత్వంలో ప్రభుత్వం కొనసాగితే గ్రోత్ రేట్‌లోమార్పు ఉంటుంది. స్వర్ణాంధ్ర విజన్ 2047లో 10 ప్రధాన సూత్రాలతో ముందుకెళ్తున్నాం. టెక్నాలజీని కూడా శాఖలు విరివిగా ఉపయోగించుకోవాలి. ప్రతి కుటుంబాన్ని మిగతా.. 2లో

## పవన్ సనాతన ధర్మ యాత్రకు సర్వం సిద్ధం

- నేటి నుంచి పవన్ సనాతన ధర్మ టూర్



**మంగళగిరి, మహానాడు:** జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ సనాతన ధర్మ పరిరక్షణ పర్యటనకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి కేరళ, తమిళనాడులో పర్యటించనున్నారు. నాలుగురోజులు పాటు వివిధ దేవాలయాలను సందర్శిస్తారు. మొదటగా కేరళలోని అనంతపద్మనాభ స్వామి ఆలయాన్ని సందర్శిస్తారు. అక్కడి నుంచి మధుర మీనాక్షి, శ్రీ పరుస రామస్వామి, అగస్త్యజీవసమాధి కుంభేశ్వర దేవాలయం, స్వామిమలైయ్, తిరుత్తై సుబ్రమణ్యేశ్వరస్వామి మిగతా.. 2లో



03

2027లో జమిలీ ఎన్నికలు!



03

ఆ రూ.300 కోట్ల విలువైన స్థలాలు అక్రమంగా విక్రయించారు!



04

గుంతల్లేని రోడ్లే ప్రభుత్వ లక్ష్యం!




06

వైసీపీ పాలనలో పోలీసులు గోడలు దూకి అరెస్టులు చేశారు!



05

కాంట్రాక్టులన్నీ ఖమ్మం జిల్లా మంత్రికే!

# పెద్దిరెడ్డికి పగ్గాలు!

- వైసీపీ ఎమ్మెల్యేల డిమాండ్
- అసెంబ్లీకి వెళ్లకపోతే జనం తిడుతున్నారు
- మీకు ఓటు ఎందుకు వేశామని నిలదీస్తున్నారు
- జగన్ రాకపోతే పెద్దిరెడ్డితో నడిపించండి
- ఎన్టీఆర్ రాకపోతే బాబుతో అసెంబ్లీ నడిపించలేదా?
- ఇప్పుడు పెద్దిరెడ్డికి పగ్గాలివ్వండి
- మాకు అనుభవం అక్కర్లేదా?
- మరి ఎమ్మెల్సీలు ఎందుకు హాజరవుతున్నారు?
- మాకంటే వాళ్లే ఎక్కువా?
- వారినీ వద్దని చెప్పే ధైర్యం లేదా?
- వైసీపీ ఎమ్మెల్యేల తిరుగుబాటు



(మార్తి సుబ్రహ్మణ్యం)

వైసీపీ ఎమ్మెల్యేలలో అసహనం కట్టలు తెంచుకుంటోంది. జగన్, పెద్దిరెడ్డి మినహా మిగిలిన 9 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకావలసిందేనని పట్టుపడుతున్నారు. జగన్ ఇగో సమస్యతో సభకు రాకపోతే, సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికయినా పగ్గాలు ఇవ్వాలని ఎమ్మెల్యేలు గళమెత్తుతున్నారు. ప్రజలతో ఎన్నికయిన మమ్మల్ని అసెంబ్లీకి వెళ్లవద్దంటున్న జగన్.. పరోక్షంగా గెలిచిన ఎమ్మెల్సీలను మాత్రం కౌన్సిల్‌కు ఎందుకు అనుమతిస్తున్నారు? వారిని కూడా కౌన్సిల్‌ను బహిష్కరించమనండి అని మిగతా.. 2లో

- మందకృష్ణ మాదిగతో సీఎం రేవంత్ రెడ్డి



# మాదిగలకు మంచి చేస్తాం

**హైదరాబాద్, మహానాడు:** సీఎం రేవంత్ రెడ్డితో మందకృష్ణ మాదిగ భేటీ ముగిసింది. మంగళవారం జరిగిన ఈ భేటీలో ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమిట్ మెంట్ ను మందకృష్ణ మాదిగ అభినందించారు. ఒక కమిట్‌మెంట్‌తో వర్గీకరణ ప్రక్రియను చేపట్టిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఒక సోదరుడిగా అండగా ఉంటానని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
2
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 12, ఫిబ్రవరి 2025 ‖




# నా జీవితంలో ఇదే పెద్ద సవాలు

**మొదటి పేజీ తరువాయి..**

యూనిట్‌గా తీసుకుని ఇల్లు, నీళ్లు, గ్యాస్, టాయిలెట్, ఇంటిపై సోలార్ వంటివి సదుపాయాలు కల్పించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని వీధిలైట్లు, రోడ్లు, డ్రైనేజ్, చెత్త సేకరణ చేసి హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీ లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. అయినప్పటికీ గత పాలన విధ్వంసం వల్ల రెవెన్యూ పెరగడం లేదు. రాష్ట్రంలో ఇండస్ట్రియల్ గ్రోత్ రేట్ మైనస్ 2.94లో ఉంది. ప్రతి సమస్య పరిష్కారానికి పాతపద్ధతుల్లో కాకుండా ఇన్నోవేటివ్‌గా ఆలోచించాలి. ప్రతి ఒక్కరూ నిత్యం నేర్చుకోవడం అవసరం. అన్నీ తెలుసు అనే అహం ఉండకూడదు. కెపాసిటీ బిల్డింగ్ కోసం కర్మయోగితో ఒప్పందం చేసుకున్నాం.

### దస్త్రాల పరిష్కారంలో వేగం పెరగాలి

దస్త్రాల పరిష్కారంలో కొందరు ఆరు నెలలకు పైగా సమయం తీసుకుంటున్నారు. ఇది ఏ విధంగా సమర్థనీయం.? దస్త్రాల పరిష్కారంలో వేగం పెంచాలి. ఇటీవల విడుదల చేసిన ఫైళ్ల క్లియరెన్స్ స్థానాలు వ్యక్తులను ఎత్తి చూపడానికి కాదు... మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ఈ ర్యాంకులు విడుదల చేశాం. కేంద్రం బడ్జెట్‌ను మంత్రులు, కార్యదర్శులు అధ్యయనం చేసి, ఆయా శాఖల వారు కేంద్రం నుంచి ఎన్ని నిధులు రాబట్టుకోగలరో చూసుకోవాలి. కేంద్రం బడ్జెట్‌లో ఆయా శాఖలు ఒక్కశాతం నిధులు తెచ్చుకోగలిగినా మార్పు చూపించవచ్చు. మార్చి నెలలోపు అన్ని విభాగాలు శాఖలకు చేయాల్సిన ఖర్చులు చేయడంతో పాటు యూసీలు సమర్పించాలి.

### కమర్షియల్ సాగులో మరింత ప్రోత్సాహం

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చింది. ఆ అవకాశాలను మనం అందిపుచ్చుకోవాలి. వినూత్న మార్గంలో వ్యవసాయంలో ఏపీ ముందుకెళ్తోంది. ప్రపంచంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా రైతులు కూడా సాగు పద్ధతులు మార్చుకుంటున్నారు. ఆక్వా, హార్టికల్చర్, పామాయిల్, కాఫీ వంటి కమర్షియల్ సాగులో ముందుకెళ్తున్న వారికి ప్రోత్సాహకాలు అందించాలి ఏఐ, టెక్నాలజీని అన్ని శాఖలు అనుసంధానం చేసుకోవాలి. 1995లో ఐటీని అడాప్ట్ చేసుకున్నాం. ఇప్పుడు ఏఐని అడాప్ట్ చేసుకోవాలి. గృహ, ఆరోగ్యం, జల్ జీవన్ మిషన్ వంటి కొన్ని శాఖలు గత ప్రభుత్వంలో విధ్వంసం అయ్యాయి. ప్రజలకు మంచినీరు అందించేందుకు కేటాయించిన జల్ జీవన్ మిషన్ నిధులను గత ప్రభుత్వం మళ్లించింది. శాశ్వతంగా ఇంటింటికీ మంచినీరు అందిచాలన్న లక్ష్యంతో జల్ జీవన్ మిషన్ కింద కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించారు. జల్ జీవన్ మిషన్ పనులు పూర్తి చేసేందుకు కొన్ని రాష్ట్రాలు లక్ష కోట్ల దాకా నిధులు రాబట్టుకున్నాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంలో భాగంగా 15 శాతం గ్రోత్ రేట్, 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 42 వేల డాలర్ల తలసరి ఆదాయమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

### చేతల్లో చూపించేవారికే ప్రజల్లో మనుగడ

1995 నుంచి 2024 వరకు ఉన్న సమాచారాన్ని తీసుకుంటే...నాటి ఆలోచనా విధానం, అమలైన పాలసీలతోనే మెరుగైన ఫలితాలు వచ్చాయి. రాబోయే రోజుల్లో భావితరాలు గుర్తించుకునేలా మన పాలసీలు, అమలు విధానం ఉండాలి. ఈ ఏడాది మీ శాఖల్లో ఏం చేయబోతున్నారనేది ముందుగానే నిర్దేశించుకోవాలి. ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా ప్రతి శాఖ పనిచేయాలి.

గ్రామ, మండల స్థాయిలో కూడా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నాం. నా నుంచి గ్రామస్థాయి నాయకుడి వరకు, సీఎస్ నుంచి గ్రామ సచివాలయ సిబ్బంది వరకూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలి.

తెలుగుజాతిని నెంబర్ వన్ కావాలన్నది నాతో పాటు డిప్యూటీ సీఎం పవన్, ఎన్డీయే ఆలోచన. మాటలు చెప్పి ప్రజలను ఏమార్చే పాలకులు కనుమరుగువతున్నారు. చెప్పింది చేసి చూపించే వారే ముందుకు రాగలుగుతున్నారు. చేతల్లో చూపించేవారికే ప్రజల్లో మనుగడ ఉంటుంది. మంత్రులు, అధికారులుగా మీకు ప్రజలకు మేలు చేసే మంచి అవకాశం లభించింది. అనుకున్న లక్ష్య సాధనకు చిత్తశుద్ధితో పని చేద్దాం.' అని సీఎం చంద్రబాబు అన్నారు.

# ఫైళ్ల క్లియరెన్సులో స్పీడ్ పెరగాలి

**మొదటి పేజీ తరువాయి..**

పెరగాలన్నారు. ఫైళ్లు ఎక్కడ క్లియర్ కాకుండా ఆగిపోతున్నాయనేదానిపైన కార్యదర్శులు, శాఖల విభాగాధిపతులు సమీక్ష చేసుకుని, ఆలస్యానికి గల కారణాలు తెలుసుకుని వాటిని తొలగించి ఫైళ్లు త్వరితగతిన పరిష్కారం చేయాలని సూచించారు.

ఫైళ్లలో ఆర్థిక, ఆర్థికేతర అనే రెండు రకాల ఫైళ్లుంటాయని, ఆర్థికేతర ఫైళ్ల పరిష్కారంలో ఫైళ్లు ఎట్టి పరిస్థితిలోనూ పెండింగ్‌లో ఉండకూడద న్నారు. ఆర్థిక పరమైన ఫైళ్లు అయితే ఆయా శాఖ ల్లోని బడ్జెట్ తదితర అంశాలను సమీక్షించుకుని ఫైళ్లను త్వరితగతిన సమీక్షించాలన్నారు. కొన్ని శాఖల్లో కొంతమంది అధికారులు తమ వద్ద ఫైళ్లను ఆరు నెలలు, సంవత్సరం వరకు ఉంచుకుంటు న్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. కొన్ని ప్రభుత్వ శాఖల్లో సగటు మూడు రోజుల్లోనే ఫైళ్లు క్లియరెన్సు అవుతున్నాయని ఆర్టీజీఎస్ సీఈఓ తెలిపారు. మరికొన్ని శాఖల్లో ఫైళ్లు ఆలస్య అవుతు న్నాయని చెప్పారు.

# ఏబీవీ.. ఎందుకలా?

**మొదటి పేజీ తరువాయి..**

కాబట్టి. అంతేకాదు. సీనియర్లు, ఎమ్మెల్యేలు ఎవరూ బాబు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని అసంతృప్తి చెందకుండా.. బాబు వెళ్లే సమయంలోనో, వచ్చే సమయంలోనలో వారిని ఆయనతో కలిపించేవారు.

పార్టీ-ప్రభుత్వానికి ముఖ్యమైన వ్యక్తులెవరో తెలిసినందున, వారికి బాబుతో అపాయింట్‌మెంట్లు ఇప్పించేవారు. అందుకే శ్రీనివాస్ ఉన్నంతవరకూ చంద్రబాబు అపాయింట్‌మెంట్ల విషయంలో ఎవరికీ సమస్యలు-ఫిర్యాదులు వచ్చేవి కావు. కానీ జగన్ ప్రభుత్వం శ్రీనివాస్‌పై విధించిన సస్పెన్షన్‌ను తొలగించేందుకే దాదాపు మూడున్నర నెలల సమయం పట్టడం ఆశ్చర్యం. పోనీ తర్వాతయినా శ్రీనివాస్‌ను సీఎంఓలో తీసుకుంటారని పార్టీ సీనియర్లు భావించారు. కానీ ఆయన తన ప్లానింగ్ డిపార్టుమెంట్‌లో చేరి, ఇప్పటికీ సెలవుపై కొనసాగుతుండటం మరో ఆశ్చర్యం.

తొలుత రఘురామకృష్ణంరాజును డిప్యూటీ స్పీకర్‌గా నియమించడం చాలామందికి రుచించలేదు. నిజానికి ఆయనకు మంత్రి పదవి లేదా స్పీకర్ ఇస్తారని చాలామంది ఆశించారు. విపక్షంలో జగన్‌పై ఆయన చేసిన యుద్ధం అలాంటి ఇమేజ్‌కు కారణమయింది.

ఇక సుదీర్ఘకాలంగా పార్టీకి సేవలందిస్తూ, అధినేత మనసెరిగి నేతలతో సమన్వయం చేసే టిడి జనార్దన్‌కు, ఇప్పటివరకూ ఎలాంటి పదవి రాకపోవడం పార్టీ వర్గాలను విస్మయపరుస్తోంది. నిజానికి ఆయనకు సలహాదారు ఇస్తారని పార్టీ వర్గాలు భావించాయి. ఎన్నికల ముందు వివిధ కులాలు, మతాలపై ప్రభావితం చూపే నేతలను బుజ్జగించి వారిని బాబుతో భేటీలు వేయించడంలో టీడీ కీలకపాత్ర పోషించారు. అయితే చంద్రబాబు రాజకీయ కార్యదర్శిగా ఉన్న టీడీ వీటికి అతీతంగా, ఇవేమీ పట్టించుకోకుండా తనకు అప్పగించిన పని చేస్తుండటం విశేషం.

ఇక జగన్‌పై పెద్ద యుద్ధమే చేసిన ఏబీని పదవీ విరమణ తర్వాత కీకల పదవితో గౌరవిస్తారని పోలీసు, పార్టీ వర్గాలు అంచనా వేశాయి. దానికంటే ముందు.. ఆయనపై జగన్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఆగమేఘాలపై తొలగిస్తుందని ఆశించారు. ఆశ్చర్యకరంగా కూటమి సర్కారు ఏర్పడిన ఆరునెలల వరకూ, ఆయనకు ప్రభుత్వపరంగా దక్కవలసిన ఆర్థిక ప్రయోజనాలు కూడా దక్కలేదు.

నిజానికి రఘురామకృష్ణంరాజు, ఏబీ వెంకటేశ్వరరావు పక్షాన సోషల్‌మీడియా సైనికులు తీవ్రంగా పోరాడారు. వారికి ఎప్పుడు న్యాయ చేస్తారని ప్రశ్నించారు. టిడి జనార్దన్‌కు మాత్రం పార్టీ శ్రేణుల సానుభూతి ఉంది. ఈ మధ్య కాలంలో ఏబీ వెంకటే శ్వరరావు కమ్మ సంఘాల సమ్మేళనాలకు హాజరుకావడం, కమ్మ వారు ఎవరిపై ఆధారపడకుండా-ఎవరినీ నమ్మకుండా సొంతకాళ్లపై ఎదగడం నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. లొంగిపోవడమంటే చావుతో సమానమని వ్యాఖ్యానించటం గమనార్హం.

ఆ సందర్భంలో కమ్మ నేతలు సైతం.. "ఏబీని ఈ ప్రభుత్వం ఎందుకు గౌరవించడం లేదు? ఆయన కులమే అందుకు అడ్డు అయితే ఆ విషయాన్ని నేరుగా చెప్పేయండి. ఆ తర్వాత మేం ఏం చేయాలో ఆలోచించుకుంటాం. జగన్‌కు అప్పుడే ఆయన సరెండర్ అయితే డీజీపీ ఇచ్చేవారు. కానీ ధైర్యంగా జగన్‌తో పోరాడినందుకు ఏబీకి ఇచ్చే గౌరవం ఇదేనా? అవసరమైతే మేము ఆయన కోసం రోడ్డెక్కుతామ"ని వేదికలపైనే అగ్గిరాముళ్లవడం, సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్యకర్తల మనోభావాలు గుర్తించిన కూటమి సర్కారు.. ఏబీని పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆయన ఇప్పటి వరకూ ఆ పదవి తీసుకోలేదు. దానిపై కార్యకర్తల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏబీకి న్యాయం చేశారని, ఆయన ఆ పదవి తీసుకుంటే జగన్ పాలనలో వేధింపులకు గురయిన తమలాంటి వారికి న్యాయం జరుగుతుందని చాలామంది పోలీసు అధికారులు సంబరపడ్డారు. ఆ కోణంలో ఆలోచించి ఏబీ చార్జి తీసుకుంటే బాగుంటుందని చెబుతున్నారు.

అయితే పార్టీకి చెందిన కొందరు మాత్రం ఏబీని కొంతమంది పక్కదారి పట్టిస్తున్నట్లు కనిపిస్తోందని, ఆయన మాత్రం వాటిని పట్టించుకోకుండా, వాస్తవ పరిస్థితిని గ్రహించి చార్జి తీసుకుంటే బాగుందని సూచిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఏదో ఆశించి భంగపడుతున్న వారే ఆయనను తప్పుదోవపట్టిస్తున్నారంటున్నారు.

మరికొందరు మాత్రం, జగన్‌తో యుద్ధం చేసిన వ్యక్తికి ప్రాధాన్యం లేని చిన్న కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారని వాదిస్తున్నారు.



అయితే పార్టీ సీనియర్లు, పోలీసు వర్గాలు మాత్రం, ఏబీకి పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడం అభినందనీయమే అయినప్పటికీ.. ఎండిగా కూడా ఆయననే కొనసాగిస్తే, ఏబీ సేవలను గౌరవించినట్లు ఉండేదని సూచిస్తున్నారు.

ఎందుకంటే కార్పొరేషన్‌కు ఐజి స్థాయి అధికారి ఎండిగా ఉన్నారు. మరి డీజీగా రిటైర్ అయిన వ్యక్తి, తనకంటే చిన్నస్థాయి అధికారి కింద ఎలా పనిచేయగలరు? ఈ విషయం ఏబీకి ఆ చైర్మన్ పదవి సూచించిన సీఎంఓ అధికారులకు తెలియదా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఏబీని చైర్మన్-ఎండిగా నియమించి ఉంటే, ఆయన ఆ పదవి తీసుకునేవారేనని పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. గౌరవం అనేది పరిపూర్ణంగా ఉండాలి కదా? ఎదుటివారికీ అది తనను గుర్తించారన్న భావన కల్పించాలి కదా అని వ్యాఖ్యానిస్తున్నారు.

అయితే మరికొందరు చైర్మన్‌తోపాటు క్యాబినెట్ హోదా ఇచ్చి ఉంటే, ఏబీ సేవలకు సరైన గుర్తింపు ఇచ్చినట్లు ఉండేదని అభిప్రాయపడుతున్నారు. కానీ ఇప్పటిదాకా కార్పొరేషన్ చైర్మన్లకు క్యాబినెట్ హోదా ఇవ్వలేదని మరికొందరు గుర్తు చేస్తున్నారు.

"ఏబీకి క్యాబినెట్ హోదానో, కార్పొరేషన్ చైర్మన్-ఎండీగానో నియమించి.. జగన్ కేసులతోపాటు, వైసీపీ హయాంలో పార్టీ నేతలను వేధించిన వారి కేసులను అప్పగిస్తే బాగుంటుంది. ఎందుకంటే అతను జగన్ బాధితుడు కాబట్టి, ఆయనకు ఉండే కసి మిగిలిన వారికి సహజంగా ఉండదు. ఇప్పుడు సీఎంఓలో ఉన్న అధికారులతో సహా ఏ అధికారి జగన్ బాధితులు కాదు. కాబట్టి వారికి జగన్‌పై పెద్ద కోపం ఉండదు. ఇప్పుడు సోషల్‌మీడియాలో ఇంకా వైసీపీ వారికే పనులు అవుతున్నాయి.. వారికే పోస్టింగులు ఇస్తున్నారన్న కార్యకర్తల అసంతృప్తి, టీడీపీ నేతలపై దాడులు చేసిన వైసీపీ నేతలపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవడం లేదన్న అసంతృప్తి వ్యవహారాన్ని కూడా ఏబీకే అప్పగిస్తే, పార్టీపై చాలా భారం తగ్గుతుంది. ఎందుకంటే ఐపిఎస్, ఐఏఎస్‌లలో ఎవరు ఏ పార్టీకి పనిచేశారన్న విషయం ఇప్పుడున్న వారిలో ఏబీకే తెలుసు. మరి బాబుగారు ఏ నిర్ణయం తీసుకుంటారో తె లియదు. ఏదేమైనా ఓసారి ఆయనను పిలిపించి మాట్లాడితే గౌరవంగా ఉంటుంద"ని ఓ మాజీ మంత్రి అభిప్రాయపడ్డారు.

ఇదిలాఉండగా.. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. నిజానికి ఏబీకి ఆర్టీసీ చైర్మన్ ఇవ్వాలని సీఎం చంద్రబాబునాయుడు, సీఎంఓలోని ఓ కీలకనేతకు సూచించగా... "బీసీ అయిన ద్వారకా తిరుమలరావుకు ఆ పదవి ఇస్తే మంచి సంకేతాలు వెళతాయి. పైగా డీజీపీగా రిటైరయ్యారు కాబట్టి ఆర్టీసీ ఎండీ ఇవ్వడమే సబబుగా ఉంటుంద"ని బాబుకు నచ్చచెప్పి, ద్వారాకాకు ఆర్టీసీ ఎండి, ఏబీకి పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చేలా బాబును ఒప్పించారన్న ప్రచారం జరుగుతోంది.

# పవన్ సనాతన ధర్మ యాత్రకు సర్వం సిద్ధం

**మొదటి పేజీ తరువాయి..**

ఆలయాలను దర్శించుకుంటారు.

పవన్ పర్యటన తమిళనాడులోనే ఎక్కువగా జరగనుంది. ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన అనుచిత వ్యాఖ్యల్ని పవన్ ఖండించారు. ఈ విషయంలో తమిళనాడులోనూ రాజకీయంగా హాట్ టాపిక్ అయింది. ఇప్పుడు పవన్ కల్యాణ్ తమిళనాడులో ఆలయాల సందర్శనకు వెళు న్నారు. ఖచ్చితంగా అక్కడి రాజకీయాల్లో పవన్ పర్యటన రాజకీయంగా ఓ టాపిక్ అవుతుంది. తమిళంలో అనర్గళంగా మాట్లాడగలిగే పవన్ కల్యాణ్ ఎం మాట్లాడినా అది ఖచ్చితంగా రాజకీయం అవుతుంది. అందుకే పవన్ పర్యటన రాజకీయంగానూ పెను సంచలనం అయ్యే చాన్స్ ఉంది.

తమిళనాడులో వచ్చే ఏడాది ఎన్నికలు జరగాల్సి ఉంది. అక్కడ సిద్ధాంతాల మధ్య పోరాటం జరుగుతుంది. డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలకు పూర్తి వ్యతిరేకత దశలో ఉండే పార్టీ బీజేపీ మాత్రమే. అయితే, ఆ పార్టీ తన భావజాలాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతోంది . దానికి అనేక కారణాలు ఉన్నాయి.

పవన్ పర్యటనతో జరిగే చర్చలతో కొంత అయినా మార్పు వస్తే.. తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై మిగతా సంగతి చూసుకుంటారని బీజేపీ పెద్దలు భావించే అవకాశం ఉంది.

# పెద్దిరెడ్డికి పగ్గాలు!

**మొదటి పేజీ తరువాయి..**

కొత్త లాజిక్‌కు తెరలేపడం ఆసక్తికరంగా మారింది.

తనకు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఇవ్వనందుకు శాసనసభ సమావేశాలను బహిష్కరించిన వైసీపీ ఫ్లోర్‌లీడర్ జగన్ వైఖరి, సొంత పార్టీ ఎమ్మెల్యేలకు మింగుడుపడటం లేదు. జగన్ ఇప్పటికి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక యినందున.. ఆయనకు ఎలాంటి ఇబ్బంది లేదని, కానీ మొదటిసారి గెలిచిన తమకు, శాసనసభ వ్యవహారాల్లో కనీస అనుభవం లేకపోతే ఎలా అని వాదిస్తున్నారు. మాకు ఇప్పటివరకూ శాసనసభలో ఏ రూము ఎవరిదో తెలియదు. అసలు ఎన్ని రూములుంటాయో కూడా తెలియదు. వాటిని తెలుసుకునే అవకాశం జగన్‌సార్ మాకు ఇవ్వడం లేదని ఓ ఎమ్మెల్యే వాపోయారు.

తమ నియోజకవర్గ ప్రజల సమస్యలను కనీసం అసెంబ్లీలో ప్రస్తావించకపోతే, జనం తమను అసమర్థ లుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "అసెంబ్లీకి వెళ్లకపోతే నువ్వేం ఎమ్మెల్యేవి? అధికారంలో ఉంటేనే అసెంబ్లీకి వెళతావా అని చివరకు సొంత బంధువులు కూడా దుమ్మెత్తిపోస్తున్నారని వాపోతున్నారు. మేం విడిరోజుల్లో ప్రజలను కలిసిన సందర్భంలో ఈ విషయాన్ని అసెంబ్లీలో మాట్లాడతానని హామీ ఇస్తున్నాం. అయితే తీరా అసెంబ్లీ సమావేశాలప్పుడు మా పార్టీ అసెంబ్లీని బహిష్కరిస్తుంది. మరి అలాంటప్పుడు మేం మా నియోజకవర్గ సమస్యలపై ఎలా మాట్లాడాలి? ఎక్కడ మాట్లాడాలి? పోనీ మంత్రుల వద్దకు వె ళదామా అంటే, మా పార్టీ అందుకు అంగీకరించడం లేదు. ఏం చేయాలో తెలియని దిక్కుమాలిన పరిస్థితి మాది. అసలు ఎమ్మెల్యే ఎందుకయ్యామో కూడా అర్థం కావడం లేద"ని ఓ కొత్త ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు.

అయితే ప్రజల నుంచి నేరుగా గెలిచిన తమను అసెంబ్లీ సమావేశాలకు రావద్దంటున్న జగన్.. పరోక్షంగా ఎన్నికైన ఎమ్మెల్సీలను మాత్రం ఎందుకు అనుమతిస్తున్నారు? అంటే సంఖ్యాబలం ఉంటేనే సభకు వస్తారా? ఇదేం పద్ధతి అంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అలాంటప్పుడు కౌన్సిల్‌ను కూడా బహిష్కరించాలి. పార్టీ అధ్యక్షుడు జగన్ గారికి లేని ప్రధాన ప్రతిపక్ష నేత హోదా, కౌన్సిల్‌లో బొత్స సత్యనారాయణకు ఎందుకు? అంటే ఇప్పుడు జగన్ గారి కంటే బొత్సకే గౌరవం ఎక్కువ. మరి అలాంటప్పుడు కౌన్సిల్‌ను కూడా బహిష్కరించడమే సబబు కదా? అని మరికొందరు ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తున్నారు.

ఒకవేళ జగన్‌కు అసెంబ్లీకి వచ్చేందుకు ఇగో అడ్డువస్తే సీనియర్ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అసెంబ్లీ పార్టీ పగ్గాలివ్వాలని డిమాండత్ చేస్తున్నారు. జగన్ కంటే పెద్దిరెడ్డి సీనియర్ అని వారు గుర్తు చేస్తున్నారు. 'ఎన్టీఆర్‌ను హేళన చేసినప్పుడు ఆయన నేను అసెంబ్లీ ముఖం చూడను.

మళ్లీ సీఎంగానే అడుగుపెడతానని శపథం చేసి అసెంబ్లీని బహిష్కరించారు. కానీ అంతమాత్రాన టీడీపీ ఎమ్మెల్యేలు సభను బహిష్కరించలేదు కదా? చంద్రబాబునాయుడు, మాధవరెడ్డి, రఘుమారెడ్డి, బొజ్జల, కోడెల, కోటగిరి విద్యాధర్‌రావు లాంటివాళ్లతో ప్రభుత్వాన్ని ఎదుర్కొన్నారు కదా? అంతెందుకు 27 మంది ఎమ్మెల్యేలతోనే పీజేఆర్ టీడీపీ ప్రభుత్వాన్ని ఎదుర్కోలేదా? ఇప్పుడు కూడా జగన్ అదే సిద్ధాంతాన్ని ఎందుకు అమలు చేయరు? అసలు సంఖ్యాబలం లేకపోతే మాకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారు" అని ఓ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు.

# హిందువుల తీర్థయాత్రల ఖర్చు 4.74 లక్షల కోట్లు!

- ఇది దేశ జిడిపిలో 2.32 శాతమట
- దేశవ్యాప్తంగా 8 కోట్ల మందికి ఉపాధి
- అమర్‌నాథ్, వైష్ణోదేవి తీర్థయాత్రలతో 90 శాతం మంది ముస్లింలకు లబ్ది
- సోమనాథ్ ఆలయ ఆదాయంలోనూ 60 శాతం ఆదాయం ముస్లింలకేనట
- ప్రభుత్వం నుంచి దేవాలయాల విముక్తి ఎప్పుడు?
- లేదా మసీదు, చర్చిలనూ ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకోండి
- హిందూ సంఘాల్లో పెరుగుతున్న డిమాండ్



ఆలయ ఆర్థిక వ్యవస్థ దేశ జిడిపికి 2.32% సహకరిస్తుంది. ఢిల్లీలో, వందలాది మంది ఇమామ్, మౌల్వీలు చేతిలో గిన్నెలతో కేజ్రీవాల్ తలుపు వద్ద నిలబడి జీతాల కోసం అభ్యర్థిస్తున్నారు. మరోవైపు, దేశ జిడిపికి దేవాలయాలు మాత్రమే 2.32% సహకరిస్తున్నాయని నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ డేటా పేర్కొంది.

భారతదేశంలో 33,000 ప్రత్యేక దేవాలయాలు, 52 శక్తిపీఠాలు, 12 జ్యోతిర్లింగాలతో సహా మొత్తం 18 లక్షల దేవాలయాలు ఉన్నాయి. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ ప్రకారం, హిందువులు మతపరమైన తీర్థయాత్రల కోసం ఏటా ?4.74 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ యాత్రల వల్ల దేశవ్యాప్తంగా 8 కోట్ల మందికి ఉపాధి లభిస్తుంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, అమర్‌నాథ్, వైష్ణో దేవి తీర్థయాత్రల నుండి సంపాదిస్తున్న వారిలో 90% మంది ముస్లింలు.

సోమనాథ్ ఆలయం నుండి వచ్చే ఆదాయంలో 60% ముస్లింలకు కూడా వెళుతుంది. కొందరు వ్యక్తులు, హిందూ మతాన్ని కించపరిచే ప్రయత్నాలలో, దేవాలయాలను నిర్మించడం వల్ల ప్రయోజనం గురించి తరచుగా వాదిస్తారు. పూలు, నూనె, దీపాలు, పరిమళ ద్రవ్యాలు, కంకణాలు, వెర్మిలియన్లు, పూజా సామాగ్రి, పెయింటింగ్స్ అమ్ముతూ లక్షలాది మంది జీవనం సాగిస్తున్నారని వారు తెలుసుకోవాలి. మీరు నిశితంగా గమనిస్తే, ఒక చిన్న దేవాలయం కూడా కనీసం 25 మందికి జీవనోపాధిని అందిస్తుంది. కాశీ విశ్వనాథ్ ఆలయంలో, వీల్‌చైర్‌లతో ఉన్న వ్యక్తులు రోజుకు కనీసం ?1,000 సంపాదిస్తారు. వివిధ దేవాలయాలలో చందనం పూసేవారు రోజుకు ?300 నుండి ?500 వరకు సంపాదిస్తారు.

దేశంలో 3.5 లక్షల మసీదులు ఉన్నాయి. అయితే చాలావరకూ చర్చిలు.. ఆసుపత్రులు, అనాధాశ్రమాలు, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయినప్పటికీ వాటి నుంచి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం లేదని హిందూ సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. కానీ అవి ఉపాధిని సృష్టించడం లేదు. అలా కాకుండా చాలా రాష్ట్రాల్లో ఇమామ్‌లు, మౌల్వీ, ఫాదర్లు, పాస్టర్ల కు ప్రభుత్వం జీతాలు చెల్లిస్తూ, రాష్ట్ర ఖజానాకు భారం మోపుతోంది. ఈ జీతాలు దేవాలయాలు మరియు హిందువుల నుండి వసూలు చేయబడిన పన్నుల నుండి నిధులు పొందుతాయి. అయినప్పటికీ వారిలో కొందరు హిందూ మతాన్ని విమర్శిస్తున్నారు. ఇది హిందువులు పెడుతున్న సెక్యులరిజం ఖర్చు.

దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుండి విముక్తి చేయాలని, లేదా మసీదు-చర్చిలను కూడా అదే నియంత్రణలోకి తీసుకురావాలని హిందూ సంస్థలు కొన్నేళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నాయి. ముస్లిం, క్రైస్తవుల ప్రార్థనాలాయాలపై లేని నియంత్రణ, మాకు ఎందుకని విశ్వహిందూ పరిషత్ లాంటి సంస్థలు నిలదీస్తున్నాయి. ఇప్పుడు ఈ డిమాండ్ మరింత ఉధృతమవుతోంది. అయితే, చర్చి-మసీదుల వల్ల ఎలాంటి ఆదాయం రాదని, అందుకే ఇబ్బడిముబ్బడిగా ఆదాయం ఉన్న హిందూ ఆలయాలనే ప్రభుతాలు నియంత్రిస్తున్నాయని హిందూ సంస్థలు మండిపడుతున్నాయి.

# మాదిగలకు మంచి చేస్తాం

**మొదటి పేజీ తరువాయి..**

ఉపకులాల వర్గీకరణలో పలు సమస్యలను సీఎంకు వివరించారు. రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా, మాదిగ, మాదిగ ఉపకులా లకు మేలు చేయాలనే మంచి లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

అసెంబ్లీలో చర్చించి, కేబినెట్ సబ్ కమిటీ వేసి, న్యాయ కమిషన్ వేసి, నివేదికలను వేగంగా తీసుకుని, కేబినెట్‌లో చర్చించి, అసెంబ్లీలోనే నిర్ణయం తీసుకున్నా మని, దీనివల్ల ఎలాంటి న్యాయ పరమైన చిక్కులు లేకుండా చేశామని వివరించారు. వర్గీకరణకు తీర్మానం చేయాలని ప్రతిపక్ష ఎమ్మెల్యేగా అసెంబ్లీలో కొట్లాడిన విషయాన్ని ప్రతినిధులు గుర్తు చేశారు. సమస్యలు, అభ్యంతరాలను కేబినెట్ సబ్ కమిటీతో పాటు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని సీఎం సూచించారు.



# నకిలీ విత్తనాల వ్యాపారంపై ఉక్కుపాదం మోపండి

**మొదటి పేజీ తరువాయి..**

భాగంగా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఈ ఆర్థిక సంవత్సరం జనవరి మాసంతానికి సాధించిన ప్రగతి, మిగిలిన రెండు మాసాల్లో అమలుపరచాల్సిన కార్యాచరణ ప్రణాళికలను ఆ శాఖ ఎక్స్ అఫిషియే స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ ప్రజెంటేషన్ ఇచ్చారు.



నకిలీ విత్తనాల సమస్య జఠిలంగా మారిందని, వాటి నియంత్రణకు పటిష్ఠమైన చర్యలను చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉందని వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు రాగా ఆయన తీవ్రంగా స్పందించారు. మర్కెట్‌లో నకిలీ విత్తనాలను విక్రయించే వారిని గుర్తించి వారి లైసెన్సు రద్దు చేయడంతో పాటు పెద్ద మొత్తంలో జరిమానాలు విధించాలని ఆదేశించారు. ఈ ఏడాది వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఇప్పటికే నిర్ధేశించుకున్న 20 శాతం వృద్ధి రేటును సాదించే విధంగా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు గరిష్ట స్థాయిలో ఆదాయం వచ్చే ఉద్యాన వన పంటలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని, దేశ విదేశాల్లో ఇప్పటికే సాగు చేస్తున్న మిక్కిలి శ్రేష్టమైన పంటలను గుర్తించి, ఆయా పంటలను రైతులు సాగుచేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. అదే విధంగా పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ విధానాన్ని పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు ప్రాధాన్యత రకాలైన ధాన్యాన్నే పడించే విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. ప్రకృతి సేద్యాన్ని కూడా పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ ఆయా ఉత్పత్తులను డోర్ డెలివరీ చేసే విధానాన్ని అమల్లోకి తీసుకురావాలన్నారు. బిందు సేద్యాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించే విధంగా తగు చర్యలు చేపట్టాలన్నారు.

మత్స్యకారులు, గొర్రెల పెంపకందారుల జీవనోపాధిని మెరుగు పర్చే విధంగా ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరించడానికి సిద్ధంగా ఉందని, అందుకు అనుగుణంగా కార్యాచర్య ప్రణాళికలను రూపొందించి అమలు పర్చాలని ఆదేశించారు. గొర్రెల పెంపకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిం చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఏప్రిల్‌లో మత్స్యకారులకు ఆర్థిక సహాయాన్ని అందజేసేందుకు అదే విధంగా రైతులకు రైతు భరోసా అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 12, ఫిబ్రవరి 2025



# గిరిజన హక్కుల పరిరక్షణే ధ్యేయం

- 1/70 చట్టాన్ని తొలగించం
- ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి




**అమరావతి, మహానాడు:** గిరిజన జాతుల అస్థిత్వాన్ని కాపాడుకోవడం అంటే భారతీయ సంస్కృతిని కాపాడుకోవడమేనని మేం బలంగా నమ్ముతున్నాం. అందుకే వారి విద్య, వైద్యం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి మేం నిరంతరం పనిచేస్తున్నాం. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమాలు అందించాం. అరకు కాఫీతో సహా ఇతర గిరిజన ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తున్నాం.

ఉమ్మడి రాష్ట్రంలోనే జీవో నెం.3ని తేవడం ద్వారా గిరిజన ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టులు గిరిజనులకు మాత్రమే దక్కేలా కృషి చేశాం. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా న్యాయపరమైన చిక్కులతో ఆ ఉత్తర్వు రద్దు అయ్యింది. దాని పునరుద్ధరణకు మేం కృషి చేస్తాం. గిరిజన ప్రాంతాల్లోని ఆస్తులపై గిరిజనులకే హక్కు ఉండాలన్న ఆలోచనతో వచ్చిన 1/70 చట్టాన్ని మార్చే ఉద్దేశం మాకు ఏమాత్రం లేదు. అలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని... అనవసరమైన అపోహలతో ఆందోళన చెందవద్దని గిరిజన సోదరులను కోరుతున్నా. సమాజంలో అట్టడుగున ఉన్న మీ అభివృద్ధికి సదా కట్టుబడి ఉన్నామని ప్రకటిస్తున్నాం అని సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం ఎక్స్ వేదిక ద్వారా పేర్కొన్నారు.

# 2027లో జమిలీ ఎన్నికలు!

- ఢిల్లీలోని రాజకీయ రహస్యాన్ని బయటపెట్టిన చింతామోహన్



**న్యూఢిల్లీ:** 2027లో పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి జమిలీ ఎన్నికలు రాబోతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇద్దరూ జాగ్రత్త పడాలని తెలియజేస్తున్నాను. నిన్న నేను ఢిల్లీ వచ్చాను. కాసేపు అటూ, ఇటూ, తిరిగాను. ఢిల్లీలో దాగివున్న రాజకీయ రహస్యం తెలిసిపోయిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతామోహన్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేఖర్లతో మాట్లాడారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి కావాల్సింది రుణాలు, ప్యాకేజీలు కాదు. శాశ్వత గనులు కావాలి. బళ్లారిలో వున్న ఇనుప ఖనిజ గనుల్లో ఒకటి విశాఖ ఉక్కుకు కేటాయించాలి. జార?ండ్ బొగ్గు గనుల్లో ఒకటి వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు ఇవ్వాలి. కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఈ మధ్య కాలంలో ఉత్తుత్తి మాటలు మాట్లాడుతున్నాడు. కిషన్ రెడ్డి గారూ... ఉత్త మాటలు ఆపండి. మా ఏపీ ప్రయోజనాలను కాపాడండి. ఉక్కు ఫ్యాక్టరీ పై ఆధారపడ్డ వేలాది మంది కార్మికుల కుటుంబాల ప్రయోజనాలను కాపాడే విధంగా శాశ్వత ఘనులు వెంటనే కేటాయించాలని కోరుతున్నానని తెలిపారు. ఇంకా, చింతామోహన్ ఏమన్నారంటే..

ఒక ముఖ్యమంత్రి పోలవరంలో 6,000 కోట్లు అక్రమంగా సంపాదించాడు. ఆయన పేరు నేను చెప్పదలుచుకోలేదు. పోలవరం అవినీతిపై విచారణ జరిపించాలని ఢిల్లీ నుంచి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేస్తున్నాను. చంద్రబాబు నాయుడు చాలా భయస్తుడు. కాస్తో... కూస్తో... భయం, నీతి ఉంది. చాలా జాగ్రత్త పరుడు. పార్టీలు వేరైనా, మా ఇద్దరిదీ ఒకటే ప్రాంతం. చంద్రబాబు గురించి నాకు బాగా తెలుసు. ఏటీఎం లాగా పోలవరాన్ని వాడుకున్నారని గతంలో మోడీ వ్యాఖ్యానించారని, దీనిపై మీ అభిప్రాయం ఏమిటని మీడియా ప్రతినిధులు అడగ్గా పై విధంగా బదులిచ్చారు.

దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయి. ఎస్సీలు ఒక్క పూట భోజనం చేసి, నడుస్తున్నారు. ఓబీసీలు రెండు పూటలు గడపలేక పోతున్నారు. బ్యాంకుల్లో ఉన్న లక్షల కోట్ల దేశ సంపదంతా, గుజరాతీలకు, మార్వాడీలకు బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. 25% ఉన్న ఎస్సీ, ఎస్టీలకు ఒక్క శాతం కూడా రుణాలు ఇవ్వడం లేదు. 50% ఉన్న ఓబీసీలకు 2% బ్యాంకులు అప్పులు ఇవ్వడం లేదు. ఇందిరా గాంధీ జాతీయం చేసిన, జాతీయ బ్యాంకుల సంపదలో వర్గీకరణ కావాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు వారి వారి జనాభా నిష్పత్తి ప్రకారం రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాను. పీవీ నరసింహారావు, దామోదరం సంజీవయ్య ఇద్దరినీ మినహాయిస్తే, రెండు కులాలే ఆంధ్రా, తెలంగాణలో ముఖ్యమంత్రి అయ్యారు. 50% ఉన్న ఓబీసీలు ఎందుకు ఒక్క రోజు కూడా సీఎం కాలేదని నేనడుగుతున్నాను? స్టాలిన్, సిద్ధరామయ్య, మూలయం సింగ్ యాదవ్, అఖిలేష్ యాదవ్, లాలూ ప్రసాద్ యాదవ్ లు ముఖ్యమంత్రులయ్యారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏ ఒక్క ఓబీసీ, ఒక్క ఎస్సీ ముఖ్యమంత్రి ఎందుకు కాకూడదు? నర్సుల పోస్టుల్లో, క్లార్క్ పోస్టుల్లో, జూనియర్ ఇంజనీర్ ఉద్యోగాల్లో అనవసరం. ముఖ్యమంత్రి పదవుల్లో వర్గీకరణ జరగాలి.

గాంధీ దేశమంతా తిరిగి, రెండే విషయాలు మాట్లాడారు. దేశానికి స్వతంత్రం, అంటరానితనం గురించి ప్రసంగించారు. 15% ఎస్సీలకు, ఏడున్నర శాతం ఎస్టీలకు గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ తెలివితేటలు వల్ల రిజర్వేషన్లు వచ్చాయి. సోనియా గాంధీ, అర్జున్ సింగ్ కృషి వల్ల కాంగ్రెస్ పార్టీ, యూపీఏ ప్రభుత్వం 27% విద్య, ఉద్యోగాల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత మాదే.

# ఏపీ సర్కారు 2,458.84 కోట్ల విలువైన ఒప్పందాలు

- మంత్రి టి.జి భరత్



**బెంగళూరు:** ఏరోఇండియా 2025లో నాలుగు ప్రముఖ ఏరోస్పేస్, డిఫెన్స్ కంపెనీలతో ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ వెల్లడించారు. ఇది రాష్ట్ర పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఒక ముఖ్యమైన ముందడుగు వేసినట్లే అని చెప్పారు. ఈ ఒప్పందాలు సమిష్టిగా రూ.2,458.84 కోట్ల పెట్టుబడిని సూచిస్తాయన్నారు. అంతేకాకుండా ఎనిమిది వేలకు పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించే అవకాశం ఉందన్నారు.

ఈ వ్యూహాత్మక భాగస్వామ్యాల్లోకి ప్రవేశించే కంపెనీలలో సముద్ర రక్షణ, మానవరహిత ఉపరితల వాహన సాంకేతికతలలో అగ్రగామి అయిన సాగర్ డిఫెన్స్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, రక్షణ తయారీలో కీలకమైన హెచ్‌ఎఫ్‌సీఎల్, స్పేస్ టెక్నాలజీ కాంపోనెంట్స్‌లో ప్రత్యేకత కలిగిన మీడియా మ్యాట్రిక్స్ వరల్డ్‌వైడ్ లిమిటెడ్ కంపెనీ ఉందన్నారు.

బెంగుళూరులో పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి భరత్ సమక్షంలో సోమవారం రాత్రి అవగాహన ఒప్పందాలు అధికారికంగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ ఏరో ఇండియా 2025లో ఆంధ్రప్రదేశ్ భారీ రక్షణ పెట్టుబడులను పొందిందన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు దూరదృష్టితో కూడిన నాయకత్వంలో, ఆంధ్రప్రదేశ్ రక్షణ తయారీ కేంద్రంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ ప్రాజెక్టులు స్వదేశీ రక్షణ తయారీని పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ ఎన్. యువరాజ్, భాగస్వామ్య సంస్థల నుండి సీనియర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏపీలో ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన అమలు స్థితి ఏంటి?

- లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గళం



**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌లో కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం అమలు వివరాలు తెలియజేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం లోక్‌సభలో ఈ మేరకు పలు అంశాలపై ఆరా తీశారు. అంచనా పెట్టుబడి, చేపల ఉత్పత్తి, ఉత్పాదకత, నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ సదుపాయాలు, మార్కెటింగ్ బలోపేతం చేయడం, మత్స్యకారుల సంక్షేమం వంటివాటిల్లో సమస్యలను అధిగమించడం, పథకం వ్యవధిపై వివరాలు కోరారు.

ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనను 2020-21 నుంచి 2024-25 వరకు అయిదేళ్ళపాటు ఆంధ్రప్రదేశ్‌తో సహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో అమలు చేస్తోందన్నారు. 2020-21 నుంచి ఇప్పటివరకు అన్ని రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు రూ.20,990 కోట్ల విలువైన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.8924 కోట్లన్నారు. ఇక పీఎంఎంఎస్‌వై కింద రూ.559.10 కోట్ల కేంద్ర వాటాతో మొత్తం రూ.2398.72 కోట్ల విలువైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలు ఇందులో ఉన్నాయని వివరించారు. ఇక పథకం అమలులో పలు కీలక ప్రాజెక్టులు చేపట్టినట్టు కేంద్ర మంత్రి వివరించారు. ముఖ్యంగా 2019-20లో వార్షిక చేపల ఉత్పత్తి 141.64 లక్షల టన్నులు ఉండగా 2022-23 నాటికి 175.45 లక్షల టన్నులకు పెరిగిందన్నారు. ఎగుమతుల విలువ రూ.46,662 కోట్ల నుంచి 2023-24 నాటికి రూ.60,524 కోట్లకు పెరిగిందన్నారు. ఇక తలసరి చేపల వినియోగం 5-6 కిలోల నుంచి 12-13 కిలోలకు పెరిగిందని పేర్కొన్నారు. ఆక్వాకల్చర్ ఉత్పాదకతను హెక్టారుకు 3 టన్నుల నుంచి నుండి 4.7 టన్నులకు చేరిందన్నారు.

# రూ.99 మద్యం సీసాలపై పెంపు లేదు

- ఎక్సైజ్ కమిషనర్ నిషాంత్ కుమార్



**అమరావతి, మహానాడు:** మద్యం బాటిళ్ల ధర పెంపు గురించి వస్తున్న సమాచారంపై ఎక్సైజ్ కమిషనర్ నిషాంత్ కుమార్ స్పష్టత ఇచ్చారు. అసలు ధర పెంపు కేవలం ?10 మాత్రమే అని ఆయన తెలిపారు. అలాగే, బ్రాండ్ లేదా పరిమాణం (క్వార్టర్/హాఫ్/ఫుల్ బాటిల్) అనేదానితో సంబంధం లేకుండా, అన్ని బాటిళ్లపై ?10 మాత్రమే పెరిగిందని స్పష్టం చేశారు. కొంతమంది ?15 లేదా ?20 పెరిగిందని తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్నారని, అది నిజం కాదని తెలిపారు. ప్రజలు వాస్తవాలను తెలుసుకొని అపోహలకు గురికాకూడదని విజ్ఞప్తి చేశారు. తాజా ధరల వివరాలను అన్ని షాపుల్లో ప్రదర్శించాలని దుకాణదారులకు ఆదేశాలు జారీ చేయనున్నట్టు తెలిపారు. బీరు, రూ.99 మద్యం సీసాలపై ఎటువంటి పెంపు లేదన్నారు.

# బీజేపీ సిద్ధాంత కర్త దీన్ దయాళ్

- వర్ధంతి సభలో మాజీ ఎమ్మెల్సీ వాకాటి




**విజయవాడ, మహానాడు:** దీన్ దయాళ్ అంత్యోదయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన మహోన్నత వ్యక్తి అని బీజేపీ నేతలు ప్రస్తుతించారు. ఇక్కడి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం దీన్ దయాళ్ వర్ధంతిని నిర్వహించారు. ముఖ్య అతిథి గా మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి మాట్లాడుతూ సంఘ్ ప్రచారక్ గా పనిచేసి రాజకీయ క్షేత్రంలోకి వచ్చి న పండింట్ దీన్ దయాళ్ బీజేపీ సిద్ధాంత కర్తగా మారారన్నారు. దీన్ దయాళ్ ఆలోచనలు నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమలు చేస్తున్నారని అందువల్ల 21రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిన విషయం గుర్తు చేశారు. పార్టీ శ్రేణులు దీన్ దయాళ్ ఆలోచనలు తో పనిచేస్తారని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, అనంతపురం జిల్లా అధ్యక్షుడు కె.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.







# ఆ రూ.300 కోట్ల విలువైన స్థలాలు అక్రమంగా విక్రయించారు!

- నిందితులపై చర్యలు తీసుకోండి
- టీడీపీ గ్రీవెన్స్‌లో బాధితుల ఫిర్యాదు
- వినతులు స్వీకరించిన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని

**మంగళగిరి, మహానాడు:**

ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర సంక్షేమ సంఘం సమితి సభ్యులు విజ్ఞప్తి చేస్తూ.. నాలుగో తరగతి ఉద్యోగుల కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ కు చెందిన 300 కోట్ల విలువైన స్థలాలను అక్రమంగా విక్రయించిన వారిపై చర్యలు తీసుకొని ఆ స్థలాలను అర్హులకు కేటాయించాలని మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావులకు బాధితులు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.

- నెల్లూరు రూరల్ మండలానికి చెందిన పి.వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేస్తూ.. తాను చనిపోయినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి తన భార్య చెల్లెలు తన ఇంటిని ఆక్రమించుకొని తమపై దౌర్జన్యం చేస్తోందని.. దీనిపై అధికారులు విచారించి ఇంటిని కబ్జా నుండి విడిపించాలని గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ ఇచ్చి వాపోయాడు.
- కడప జిల్లా, మైదుకూరు మండలం బ్రహ్మణవీధికి చెందిన పి. రామారావు విజ్ఞప్తి చేస్తూ.. ప్రభుత్వ భూ సేకరణలో భాగంగా తమ భూమిని ప్రభుత్వం తీసుకుంటే అందులో తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా తన తమ్ముళ్లు ఇబ్బంది పెడుతున్నారని.. తనను చంపేస్తామని గన్ పెట్టి బెదిరిస్తున్నారని.. దయ చేసి తనకు రావాల్సిన వాటాను తనకు ఇప్పించేలా చూడాలని వేడుకున్నాడు.
- చిత్తూరు జిల్లా, పూతలపట్టు చింతమాకులపల్లికి చెందిన వి.రాకేష్ విజ్ఞప్తి చేస్తూ మాజీ సైనికులకు జీవనోపాధిలో భాగంగా ప్రభుత్వం తనకు స్థలం కేటాయించిందని దానికి సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చే లోపు మరో వ్యక్తి తనకు కేటాయించిన భూమిని ఆక్రమించుకున్నాడని.. అతని నుండి భూమి విడిపించి తనకు కేటాయించాలని గ్రీవెన్స్‌లో అభ్యర్థించాడు.



- ఎన్టీఆర్ జిల్లా, విజయవాడకు చెందిన మర్రి అంభిక విజ్ఞప్తి చేస్తూ.. తాము 20 ఏళ్ళ నుండి విజయవాడలో అద్దె ఇంట్లో ఉంటున్నామని.. అద్దెలు చెల్లించుకోలేక ఇబ్బందులు పడుతున్నామని.. దయ చేసితమకు ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని ఆమె వేడుకున్నారు.
- నెల్లూరు జిల్లా, కలిగిరికి చెందిన గిరిజమ్మ, షేక్ ఖాజా రహంతుల్లా, షేక్ ఫరీదా, సీహెచ్ శివరామయ్యలు విజ్ఞప్తి చేస్తూ.. తమ భూములను ప్రభుత్వం భూసేకరణ కింద తీసుకొని నేటికి పరిహారం ఇవ్వలేదని.. దీనిపై కోర్టుకు వెళ్లగా వెంటనే తమకు పరిహారం ఇవ్వాలని ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదని.. దయ చేసి తమకు రావాల్సిన పరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.



- నెల్లూరు జిల్లా, అనంతసాగరం మండలం మంచాలపల్లి గ్రామానికి చెందిన రాజాల తిరుపాలు తమకు వారసత్వంగా వచ్చిన భూమిని ఆన్ లైన్ లో తమ పేర్లను తొలగించి వేరొకరి పేర్లను ఎక్కించారని దీనిపై అధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 12, ఫిబ్రవరి 2025 ||



# విద్యుదాఘాతంతో తల్లీకుమారుడు మృతి విచారకరం!

- బాధిత కుటుంబానికి అండగా ఉంటాం
- రైతులు పొలాల్లోకి వెళ్లేప్పుడు అప్రమత్తంగా ఉండాలి
- ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగల సమాచారం ఇవ్వాలి
- విద్యుత్ స్తంభాలకు, లైన్లు మరమ్మతు చేయాలి
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశం



**అమరావతి, మహానాడు:** విద్యుదాఘాతంతో కడప జిల్లా బి.కొండూరు మండలం గుంతపల్లి గ్రామంలో మరణించిన తల్లీకుమారులు గురమ్మ, జయసుబ్బారెడ్డి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. పొలానికి నీళ్లు పెడుతుండగా ప్రమాదకర విద్యుత్ తీగలు తగిలి ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృత్యువాత పడటం అత్యంత బాధాకరమన్నారు. ఈ దుర్ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి గొట్టిపాటి.. మృతుల కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పొలాల్లోకి వెళ్లేప్పుడు రైతులంతా అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ప్రమాదకరంగా అతి తక్కువ ఎత్తులో, నేలకు వేలాడుతున్న కరెంట్ తీగలకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు తెలపాలని సూచించారు.

ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ తీగలకు, స్తంభాలకు వెంటనే మరమతులు చేసి వాటిని సరిచేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుదాఘాతం ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే వేసవిలో రైతులు మరింత ఎక్కువగా వ్యవసాయ మోటార్లను వినియోగిస్తారని... ఇటువంటి సమయంలో ఎటువంటి దుర్ఘటనలూ జరగకుండా జాగ్రత్త వహించాలని కోరారు.

# జనసేన ఉన్నంతకాలం వైసీపీ అధికారంలోకి రాదు

- ఊసరవెల్లి ముదిరి అంబటి రాంబాబు అయింది
- రాజకీయాల్లో అతిపెద్ద భఫున్ అంబటి
- శవాలపై పేలాలు ఏరుకున్న అంబటి
- నిప్పులు చెరిగిన జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి



**విజయవాడ, మహానాడు:** రాష్ట్ర రాజకీయాల్లో జనసేన ఉన్నంతకాలం వైసీపీ అధికారంలోకి రాదని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. ప్రజారాజ్యం రూపాంతరం చెంది జనసేన అయిందంటూ మెగాస్టార్ చిరంజీవి చేసిన వ్యాఖ్యలపై వ్యంగ్యంగా మాట్లాడిన వైసీపీ నేత అంబటి రాంబాబుపై ఆయన మంగళవారం పార్టీ కార్యాలయంలో నిప్పులు చెరిగారు. 175 కి 175 సీట్లు వస్తాయంటూ బీరాలు పోయిన వైసీపీని 11 సీట్లతో పాతాళానికి తొక్కటంలో కీలకపాత్ర వహించిన పవన్ కల్యాణ్ పేరు వింటేనే వైసీపీ నేతలకు కడుపుమండి పోతుందన్నారు.

అ సందర్భంగా జనసేనపై ఎవరు మాట్లాడినా సహించేది లేదని హరి హెచ్చరించారు. రాజకీయాల్లో అంబటి పెద్ద భఫూన్ అంటూ వ్యాఖ్యానించారు. ప్రజలిచ్చిన అధికారాన్ని గంట, అరగంట అంటూ ఎంజాయ్ చేసిన నాయకుడు అంటూ మండిపడ్డారు. అవినీతితో అంట కాగటమే కాకుండా శవాలపై సైతం పేలాలు ఏరుకున్న ప్రజా కంఠకుడు అంబటి అంటూ దుమ్మెత్తిపోశారు. ఊసరవెల్లి ముదిరి అంబటి అయిందంటూ ఏద్దేవా చేశారు. రాంబాబు చరిత్ర గురించి మాట్లాడాలి అంటే మాకే సిగ్గుగా ఉందన్నారు. మెగా ఫ్యామిలీపై విషం కక్కటం అంబటికి కొత్తేమీ కాదని, ఆనాడు రాజశేఖర్ మెప్పుకోసం నేడు జగన్ ప్రాపకం కోసం అంబటి బానిసలా మారాడని విమర్శించారు. చిరంజీవి పేరు చెబితే పులకరించని తెలుగువాని హృదయం ఉండద న్నారు. వైసీపీ నేతల పేర్లు చెవిన పడితేనే ప్రజలు చీత్కరించుకుంటు న్నారన్నారు. మెగా ఫ్యామిలీ గురించి మాట్లాడేటప్పుడు నాలుకను అదుపులో పెట్టుకోవాలని లేనిపక్షంలో పళ్ళు, ఒళ్ళు గుల్లవుతాయని ఆళ్ళ హరి వైసీపీ నేతల్ని హెచ్చరించారు.

# పాఠశాలల్లో డ్రాపవుట్స్ ఉండనీయొద్దు

- సీఎం చంద్రబాబు ఆదేశం



**అమరావతి, మహానాడు:** పాఠశాలల్లో ఎటువంటి డ్రాపవుట్స్ లేకుండా చూడాలని, బడిఈడు పిల్లలు అందరూ పాఠశాల నెట్ వర్కులోకి వచ్చే విధంగా సంబంధిత నియోజక వర్గాల శాసన సభ్యులుడు బాధ్యత వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్ర సచివాల యంలో మంగళవారం జరిగిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో భాగంగా పాఠశాల, ఉన్నత విద్య, వృత్తి నైపుణ్య శాఖల పనితీరును ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే.. అవసరమైతే బ్రిడ్జి కోర్సులను నిర్వహించాలి. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి ప్రణాళికలు రూపొందించాలి. ఎటు వంటి లిటిగేషన్లకు తావు లేకుండా ఉద్యోగుల సర్వీసు నిబంధనలను పటిష్ఠంగా అమలు పర్చాలి. యూనివర్శిటీల్లో ఖాళీల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలి, లిటిగేషన్లకు తావులేకుండా నోటిఫికేషన్ ను సాద్యమైనంత త్వరగా జారీచేయాలి. ఉన్నత విద్యలో తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాలు ముందజలో ఉన్నాయి, అదే స్థాయిలో రాష్ట్రాన్ని కూడా నిలిపేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఇందుకై ఆఫ్ లైన్ కోర్సులతో పాటు ఆన్ నైన్ కోర్సులను కూడా పెద్దఎత్తున ప్రవేశ పెట్టాలి. కాగా, జె.ఇ.ఇ. మెయిన్స్ ఫలితాల్లో టాప్ హండ్రెడ్‌లో నిలిచిన రాష్ట్రానికి చెందిన మనోజ్ఞ గుత్తికొండను ముఖ్యమంత్రి అభినందించారు.

# ప్రకాశం జిల్లాలో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు!



**ప్రకాశం, మహానాడు:** జిల్లాలో ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ ప్రకాశం జిల్లా ఎక్సైజ్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. అద్దంకి ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించి అధికారులు స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అక్కడి ఉర్వశి వైన్ షాప్‌ను తనిఖీ చేసి, గరిష్ఠ చిల్లర ధర ఉల్లంఘనలు ఉన్నాయా అని పరిశీలించారు. వినియోగదారులకు ఎంఆర్పీ రేట్లు కనబడేలా చర్యలు తీసుకోవాలని షాప్ యాజమాన్యానికి సూచనలు ఇచ్చారు.

అలాగే, ఉర్వశి వైన్ షాప్ వద్ద బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఆ తర్వాత, ఒంగోలు డిపోను సందర్శించి, స్టాక్ రికార్డులను పరిశీలించారు. తదుపరి ప్రకాశం జిల్లా పోలీస్ కార్యాలయం, పరేడ్ గ్రౌండ్స్‌ను కూడా సందర్శించారు. ఈ నెల 15న, నవోదయం 2.0 కార్యక్రమంపై అవగాహన కల్పించడం, ఆంధ్రప్రదేశ్‌ను అక్రమ మద్యం నుంచి విముక్తం చేయటమే ధ్యేయంగా అక్కడ ఒక ర్యాలీ నిర్వహించాలని ప్రణాళిక రూపొందిస్తున్నామని మద్యం నిషేధం, ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ తెలిపారు.

# దర్శిలో త్వరలో మినీ స్టేడియం

- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



**దర్శి, మహానాడు:** పట్టణం, అద్దంకి రోడ్, ఎన్ఎస్‌పీ కాలనీ ప్రాంగణంలోని ఫైర్ స్టేషన్ పక్కన గల మినీ స్టేడియం ప్రాంతాన్ని మంగళవారం దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అధికారులతో కలిసి పరిశీలించారు. త్వరలో స్టేడియం పనులు ప్రారంభమయ్యేందుకు ఉన్న అడ్డంకులను తొలగించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. గతంలో మినీ స్టేడియం కోసం స్థలాన్ని కేటాయించినప్పటికీ వైసీపీ నిర్లక్ష్యంగా వదిలేసిందని తెలిపారు. నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కోరామని చెప్పారు. ఈ కార్యక్రమం లో ప్రకాశం జిల్లా క్రీడాశాఖ అధికారులు డీఎస్‌డీవో రాజేశ్వరి, విజయవాడ నుండి శాప్ డీఈ శ్రీహరి, మేనేజర్ అనిల్, దర్శి మండల రెవిన్యూ టీటీ, సిబ్బంది, దర్శి మున్సిపల్ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు ఉన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

దర్శిలోని తన నివాసం వద్ద ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన ఆర్థిక సహాయ చెక్కులను లబ్ధిదారులకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పంపిణీ చేశారు. ఇదిలావుండగా, వేముల బండ గ్రామం లో కొండ గురునాథ స్వామి తిరునాళ మహోత్సవం సందర్భంగా ముందు రోజు గ్రామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో డాక్టర్ లక్ష్మి, డాక్టర్ లలిత్ దంపతులు పాల్గొన్నారు.

## వైసీపీ పాలనలో పోలీసులు

# గోడలు దూకి అరెస్టులు చేశారు!

- న్యాయవాది గూడపాటి, బాధితుల స్టేట్‌మెంట్ రికార్డు చేసిన సీఐడీ
- సీఐడీ మాజీ డీజీ పీవీ సునీల్ కుమార్‌పై విచారణలో కీలక పరిణామం



**విజయవాడ, మహానాడు:** సీఐడీ మాజీ డీజీ పీవీ సునీల్ కుమార్‌పై విచారణలో భాగంగా కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆయనపై ఫిర్యాదు చేసిన న్యాయవాది లక్ష్మీనారాయణను సీఐడి అధికారులు కార్యాలయానికి మంగళవారం పిలిపించారు. ఆ క్రమంలో ఆయన వద్దనున్న సాక్ష్యాలను వారు తీసుకున్నారు. అలాగే ధరణికోట వెంకటేష్, దారపనేని నరేంద్రతోపాటు సీనియర్ జర్నలిస్ట్ కొల్లు అంకబాబును సైతం సీఐడీ కార్యాలయానికి రావాలని సూచించారు.

సునీల్ కుమార్‌పై విచారణలో భాగంగా న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ స్టేట్‌మెంట్‌ను సీఐడీ అధికారులు రికార్డు చేశారు. కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఆదేశాలతో సీఐడీ అధికారులు ఈ విచారణ ప్రారంభించారు. సీఐడీ అధికారులు.. న్యాయవాది లక్ష్మీనారాయణను పిలిపించి.. ఈ ఆరోపణలపై విచారించారు. గతంలో సీఐడీ డీజీగా ఉన్న సమయంలో పీవీ సునీల్ కుమార్.. అరాచకాలకు పాల్పడ్డారని, అలాగే అనేక మందిని నిర్బంధించారని, అంతేకాకుండా ఆయన సమక్షంలో వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారంటూ గతంలో కేంద్ర హెూం మంత్రిత్వ శాఖకు న్యాయవాది లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు. దీనిపై ఆ సమయంలో హెూం శాఖ స్పందించి.. ఈ వ్యవహారంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. కానీ, పోలీస్ శాఖ దీనిపై సరైన రీతిలో స్పందించలేదు.

అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం తన ఫిర్యాదు వ్యవహారం ఎంత వరకు వచ్చిందంటూ కేంద్ర హెూం శాఖకు మళ్లీ న్యాయవాది లక్ష్మీ నారాయణ లేఖ రాశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు డీజీపీ ఈ వ్యవహారంపై విచారణ ప్రారంభించారు. అందులోభాగంగా సీఐడీ అధికారులు విచారణకు వారిని పిలిపించారు.

అలాగే టీడీపీ మీడియా సెల్ ఇన్ ఛార్జ్ దారపనేని నరేంద్ర, సీనియర్ జర్నలిస్ట్ కొల్లు అంకబాబుతోపాటు, టీడీపీకి చెందిన నేత ధరణికోట వెంకటేష్‌లను అరెస్ట్ చేసిన తీరుకు సంబంధించి తన వద్దనున్న సాక్ష్యాధారాలను సీఐడీ అధికారులకు ఈ సందర్భంగా ఆయన అందజేశారు. అర్ధరాత్రి గోడలు దూకి మరి అరెస్టులు జరిగిన తీరును ఈ సందర్భంగా సీఐడీ అధికారులకు ఆయన వివరించారు.

ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా సీనియర్ జర్నలిస్ట్ అంకబాబు నివాసానికి వెళ్లి అరెస్ట్ చేశారని తెలిపారు. అర్ధరాత్రి గుంటూరు సీఐడీ కార్యాలయంలో ఆయన్ని నిర్బంధించారని.. కనీసం ఆయన వయస్సును సైతం పోలీసులు పట్టించుకోకుండా వ్యవహరించారని సీఐడీ అధికారులకు న్యాయవాది లక్ష్మీనారాయణ చెప్పారు. ధరణికోట వెంకటేష్ వ్యవహారంలో సైతం పోలీసులు చాలా దారుణంగా వ్యవహరించారని తెలిపారు.

దారపనేని నరేంద్రను అరెస్ట్ చేసిన సమయంలో కూడా పోలీసులు ఇదే రీతిలో వ్యవహరించారని పేర్కొన్నారు. అంతేకాకుండా.. ఈ అరెస్ట్‌ల సమయంలో ఇంట్లోని వారిని సైతం తీవ్ర భయభ్రాంతులకు గురిచేశారని చెప్పారు. దీంతో న్యాయవాది లక్ష్మీనారాయణ వాంగ్మూలం ఆధారంగా.. ధరణికోట వెంకటేష్‌తోపాటు దారపనేని నరేంద్రను సీఐడీ పోలీసులు కార్యాలయానికి పిలుపించుకొన్నారు. వారి స్టేట్‌మెంట్ సైతం వారు రికార్డు చేశారు.

# గుంతల్లేని రోడ్లే ప్రభుత్వ లక్ష్యం!

- గతంలో రహదార్లపై ప్రయాణం నరకం
- ఇప్పుడిప్పుడే రోడ్లు బాగుపడుతున్నాయి
- కొత్త నిర్మాణాలన్నీ నాలుగేళ్ళలో పూర్తి కావాలి
- అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశం
- ఈ నెలాఖరుకు గుంతల రహిత రహదార్ల లక్ష్యం సాధిస్తామన్న అధికారులు

**అమరావతి, మహానాడు:** రాష్ట్రంలో ఎక్కడా కూడా తనకు గుంతలున్న రహదార్లు కనిపించకూడదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గతంలో రహదార్లపైన ప్రయాణించాలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఉండేదని, దాన్ని పోగొట్టి ఇప్పుడు కూటమి ప్రభుత్వం రహదార్లను బాగు చేస్తోందని, రోడ్లు కాస్త అందంగా కనిపిస్తున్నాయని, ఇది సంతోషదాయకమన్నారు. అయితే ఇక్కడితోనే మనం ఆగిపోకూడదని సూచించారు.

మంత్రులు, కార్యదర్శుల సదస్సులో భాగంగా మంగళవారం రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఇచ్చిన ప్రజంటేషన్ పైన సీఎం మాట్లాడారు. జాతీయ రహదార్లపైన కూడా తనకు ఎక్కడా గుంతలు కనిపించకూడదన్నారు. రహదార్లకు మరమ్మతులు చేయడం, రోడ్లు నిర్మించడం ఒక్కటే కాదని, వాటి నిర్వహణ కూడా నిరంతరం సమర్థవంతంగా చేయాలన్నారు. ఇప్పుడు మనం చేపట్టిన రోడ్లు నిర్మాణ పనులన్నీ కూడా నాలుగేళ్లలో పూర్తి కావాలన్నారు. అర్బన్ ఏరియాలో కూడా ఎక్కడా గుంతలున్న రహదార్లు తనకు కనిపించకూడదన్నారు. కేంద్రం ప్రభుత్వం చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణాలు, రైల్వే నిర్మిస్తున్న రైల్వే వంతెనల నిర్మాణాలు చేపడుతుంటుందని, కేంద్రంతో కూడా సమన్వయం ఏర్పాటు చేసుకుని ఆ పనులు ప్రగతిని కూడా సమీక్షించుకోవాలని, రాష్ట్రంలో కనెక్టివిటీకి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.



ఈ నెలాఖరుకు గుంతల రహిత రహదార్లు

ఈ నెలాఖరులోపు రాష్ట్రంలో ఆర్ అండ్ బి రహదార్లన్నిటినీ గుంతల రహిత రహదార్లుగా మారుస్తామని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే చెప్పారు. 20,059 కిలోమీటర్ల రోడ్లను గుంతల రహితంగా మార్చాలనే లక్ష్యంలో ఇప్పటికే జనవరి నెలాఖరుకు 14,168 కిలోమీటర్లు గుంతల రహితంగా మార్చామన్నారు. మిగిలింది కూడా ఈ నెలాఖరు లోపు పూర్తి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రామం నుంచి మండల కేంద్రం, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రహదారులు వేయాలనే కార్యక్రమం వేగంగా జరుగుతోందన్నారు. 2026 మార్చి నెలాఖరులోపు మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రహదారుల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

# 14% మార్జిన్ పెంపుతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడదు

- బాటిల్‌పై రూ.10 పెంపుతో ఏటా రూ.100 కోట్ల వరకు ఆదాయం
- 90 వేల దరఖాస్తులే షాపుల కేటాయింపులో పారదర్శకతకు నిదర్శనం
- గీత కులాల షాపుల్నీ పారదర్శకంగా కేటాయిస్తున్నాం
- నవోదయం 2.0తో సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం
- రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



**అమరావతి, మహానాడు:** మద్యం దుఖాణాలకు 14 శాతం మార్జిన్ పెంపుతో ప్రభుత్వ ఆదాయానికి ఏ మాత్రం గండి పడే అవకాశం లేదని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. బాటిల్ పై రూ.10 పెంపుతో ప్రభుత్వానికి ఏటా రూ.100 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. మద్యం షాపుల కేటాయింపు నుండి బ్రాండ్ల పునరుద్ధరణ వరకు ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా వ్యవహరించిందన్నారు.

మద్యం పాలసీకి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను అన్నింటినీ సరిదిద్దుతూ తమ ప్రభుత్వం నూతన మద్యం పాలసీని రూపొందించి అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. మద్యం షాపులకు ఏకంగా 90 వేల దరఖాస్తులు వచ్చాయని, తద్వారా ప్రభుత్వానికి రూ.1800 కోట్ల మేర ఆధాయం వచ్చిందన్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని జిల్లా కలెక్టర్ల సమక్షంలో నిర్వహించి పారదర్శకంగా షాపులు కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్న ఆరు జిల్లాలు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లోనూ షాపుల కేటాయింపు పారదర్శకంగా, ప్రశాంతంగా జరుగుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కల్లుగీత కార్మికులకు 340 షాపులు కేటాయించామని, ఈ విషయంలో కోర్టుకు వెళ్లినవారు భంగపడ్డారన్నారు.

రూ.99కే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెచ్చామని, 12 రకాల పరీక్షలు నిర్వహించిన తదుపరే షాపులకు తరలిస్తున్నామన్నారు. ఎక్కడా ఎవరి ప్రమేయం లేకుండా డిపోల నుండి వచ్చే ఇండెంట్ ఆధారంగా మాత్రమే మద్యం కేటాయింపులు చేస్తున్నామన్నారు. బెల్టు షాపుల విషయంలో కూడా ప్రభుత్వం కఠినంగా ఉందని, ట్రాక్ అండ్ ట్రేస్ విధానంలో ప్రతి బాటిల్‌ని మానిటర్ చేస్తున్నట్టు తెలిపారు. బెల్టు షాపులు నిర్వహిస్తూ పట్టుబడితే, మద్యం ఇచ్చిన షాపుకు తొలిసారి రూ. 5 లక్షల జరిమానా విధిస్తామని, మరోసారి పట్టుబడితే ఏకంగా లైసెన్స్ రద్దు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సారా రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో త్వరలోనే నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నామని మంత్రి తెలిపారు. ఈ విషయంలో అవసరమైన మేరకు పీడీ యాక్ట్ కేసులు కూడా నమోదు చేస్తామన్నారు.

# ప్రభుత్వం మీద వ్యతిరేకత రోజురోజుకీ పెరుగుతోంది..

- చంద్రబాబు మోసాలను ప్రజల్లో మరింతగా ఎండగట్టాలి
- పార్టీ సీనియర్ నేతలతో వైయస్ జగన్

**తాడేపల్లి, మహానాడు:** వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో, అందుబాటులో ఉన్న పార్టీ సీనియర్ నేతలతో పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలతో పాటు, ఇటీవల సీఎం చంద్రబాబు మాటలు, ప్రకటనలు.. తదితర అంశాలు సమావేశంలో చర్చకు వచ్చాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో ఏవీ నెరవేర్చక పోవడంతో, ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత రోజురోజుకీ తీవ్రం అవుతోందని, అందువల్ల పార్టీ నాయకత్వమంతా సమష్టిగా కృషి చేయాలని, సీఎం చంద్రబాబు మోసాలను ప్రజల్లో ఎండగట్టాలని సమావేశంలో సీనియర్ నేతలకు జగన్ సూచించారు. సూపర్‌సిక్స్ హామీల అమలుపై చేతులెత్తేయడమే కాకుండా.. అందుకే ఏవేవో సాకులు చెబుతూ.. అవి ప్రజలు నమ్మేలా ప్రచారం చేస్తున్నారని గుర్తు చేశారు.



వీటన్నింటి నేపథ్యంలో చంద్రబాబు వంచన, దారుణ మోసాలను మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అందు కోసం రోజూ ప్రజల్లో ఉండాలని, వారితో మరింత మమేకం కావాలని జగన్ సూచించారు. పార్టీ సీనియర్ నేతలు అంబటి రాంబాబు, పేర్ని నాని, పేర్ని కిట్టు, కొట్టు సత్యనారాయణ, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నందిగం సురేష్, ఎస్వీ మోహన్‌రెడ్డి, కైలే అనిల్‌కుమార్, కావటి మనోహర్‌నాయుడు, కె.సురేష్‌బాబు, గోరంట్ల మాధవ్, ఈపూరు గణేష్, ఆలూరు సాంబశివారెడ్డి, మజ్జి శ్రీనివాసరావు, వంకా రవీంద్రనాథ్, అదీప్‌రాజు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
5
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 12, ఫిబ్రవరి 2025

## కోటప్పకొండ తిరునాళ్ల మహోత్సవంపై అలసత్వం వద్దు

◆ దేవాదాయ కమిషనర్ రామచంద్ర మోహన్

నరసరావుపేట, మహానాడు: మహాశివరాత్రి పర్వదినం రోజున కోటప్పకొండ తిరుణాల సందర్భంగా ఏర్పాట్లను దేవాదాయ కమిషనర్ రామచంద్ర మోహన్ పర్యవేక్షించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి, పూజారులు సిబ్బందితో కలిసి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కోటప్పకొండ తిరునాళ్ల మహోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లపై అలసత్వం వహించవద్దని కమిషనర్ రామచంద్ర మోహన్ ఆదేశాలు జారీ చేశారు. కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహింపచేసిన ఆలయ పూజారులు అధికారులు ముందుగా ఆయనకు ఆలయం మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.





## అసెంబ్లీ అంటే జగన్‌కు భయం!

◆ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఎద్దేవా

అమరావతి, మహానాడు: చేసిన తప్పులకు ఎక్కడ సమాధానం చెప్పాల్సి వస్తుందో అన్న భయంతోనే మాజీ సీఎం జగన్ అసెంబ్లీకి రానంటున్నారని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఎద్దేవా చేశారు. అంతమాత్రం దానికి అతడిని, వైసీపీ ఎమ్మెల్యేలను ప్రజలు గెలిపించింది ఎందుకని ప్రశ్నించారు. ప్రజాసమస్యలపై అసెంబ్లీలో మాట్లాడేందుకు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్నది అన్న విషయం కూడా మరిచిపోయి, సభకు రానంటూ ప్రజాస్వామ్యం అంటే అతడికి ఉన్న చిన్న చూపుని చాటుకుంటున్నారన్నారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో విప్‌లు అందరితో అసెంబ్లీ సమావేశాల సన్నాహక సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. జగన్ అసెంబ్లీకి రాననడంపై స్పందిస్తూ అది ఎంత వరకు సమంజసం అని నిల దీశారు. గతంలో ఏ నాయకుడు ఇలా వ్యవహరించలేదన్నారు. జగన్ అడిగే ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాల్సింది ప్రజలని, సభ కాదన్నారు.

## ఆలపాటి రాజాని అఖండ మెజారిటీతో గెలిపించాలి

◆ జంగా కృష్ణమూర్తి పిలుపు

రేపల్లె, మహానాడు: కృష్ణ, గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రేపల్లె నియోజకవర్గంలోని రేపల్లెలోని బార్ కౌన్సిల్, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయం, రేపల్లె మున్సిపల్ కార్యాలయం, వివిధ మండల కార్యాలయల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం జరిగింది. కూటమి ఎమ్మెల్సీ



అభ్యర్థి ఆలపాటి రాజాని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు జంగా కృష్ణమూర్తి కోరారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ వై. రామస్వామి, కొల్లూరు మండల మాజీ ఎంపీపీ డాక్టర్ మధు, గుంటూరు జిల్లా టీడీపీ వైస్ ప్రెసిడెంట్ అడపా శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 26 జిల్లాల్లోనూ యూత్ హాస్టల్స్ ఏర్పాటు చేయాలి

◆ కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ హరీష్ బాలయోగి

న్యూఢిల్లీ: ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుక్ మాండ వీయని అమలాపురం పార్లమెంటు సభ్యుడు, పార్లమెంటరీ స్పోర్ట్స్ మెంబర్ జి.ఎమ్.హరీష్ బాలయోగితో కలిసి శాప్ ఛైర్మన్ రవినాయుడు మంగళవారం



మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిరువురూ కలిసి విజయనగరంలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు నిధులు సమకూర్చాలని ఆయనను కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లోనూ యూత్ హాస్టల్స్ ఏర్పాటు చేయాలని, విజయ వాడలోని ఐజీఎంసీ స్టేడియంలో క్రీడావసతులు ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి మాండవీయకి విజ్ఞప్తి చేశారు. తిరుపతి, కాకినాడ, గుంటూరు ఏఎన్‌యూలో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీల ఏర్పాటు, రాష్ట్రవ్యాప్తంగా రూ.237 కోట్లతో క్రీడాసదుపాయాలు కల్పించాలని, గతంలో కేంద్రానికి పంపిన ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలని విన్నవించారు. వీరితోపాటు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఉన్నారు.

## వైభవంగా శ్రీ గోపయ్య సమేత లక్ష్మి తిరుపతమ్మ కల్యాణ మహోత్సవం

◆ ఎమ్మెల్యే మాధవి విశేష పూజలు

గుంటూరు, మహానాడు: పశ్చిమ నియోజకవర్గం 25వ డివిజన్ మిర్చి యార్డు వద్ద, 44వ డివిజన్ కొరిటేపాడు వాకింగ్ ట్రాక్ వద్ద గల శ్రీ గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ తల్లి కల్యాణ మహోత్సవాల్లో ఎమ్మెల్యే గళ్ళ మాధవి పాల్గొని స్వామివారు, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికి, అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. స్వామివారు, అమ్మవార్ల కల్యాణ మహో త్సవంలో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానని, ఆ స్వామి వారు, అమ్మవార్ల కృప అందరి పై ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని



కోరుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాలం వెంకటేశ్వర్లు, కదిరి సంజయ్, కన్నసాని బాజి, రాజా, యర్రాకుల శ్రీనివాస్, పవన్ వెంకీ, చెంబెటి మణి కుమారి, తుమ్మల నాగేశ్వరరావు, చంద్రగిరి బాబు, తదితరులు పాల్గొన్నారు.

### బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తరువాతే
## స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

◆ ఈరోజు ప్రామిస్ డే సందర్భంగా రేవంత్ రెడ్డి ఇచ్చిన ప్రామిస్ నిలబెట్టుకోవాలని రేవంత్ రెడ్డికి కోరుతున్నాం

◆ కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో ఓడగొట్టారు.

◆ చబ్బీస్ జనవరికి రైతు భరోసా, ఇందిరమ్మ భరోసా ఇస్తామన్నారు ఇప్పటివరకు పది పైసల మంది కూడా అందలేదు



సిద్ధిపేట: కొనాయిపల్లి గ్రామంలో భక్తిశ్రద్ధలతో శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు గారు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కెసిఆర్ ఏ ముఖ్య కార్యక్రమాన్ని అయినా ఈ దేవాలయం నుండి ప్రారంభిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి 15 నెలలుగా దేవాలయాలకు నిధులు విడుదల చేయడం లేదు. దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి పంద్రాగస్టు కల్లా రైతు రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి మాట ఇచ్చి మోసం చేశారు. మాట తప్పడం తప్ప మాట నిలబెట్టుకోవడం రేవంత్ రెడ్డికి చేతకాదు.

చబ్బీస్ జనవరికి రైతు భరోసా అందరు రైతులకు ఇస్తామన్నారు ఇప్పటివరకు పూర్తి చేయలేదు. చబ్బీస్ జనవరి కి ఇందిరమ్మ భరోసా ఇస్తామన్నారు ఇప్పటివరకు వేయలేదు. పది పైసల మంది కూడా అందలేదు. మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడగొట్టారు. కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో ఓడగొట్టారు. ఈరోజు ఫిబ్రవరి 11 ప్రామిసస్ డే. ఈ ప్రామిస్ డే సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి. బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాకే ఎన్నికలకు వెళ్ళాలి.

## ప్రతి మహిళకు 35,000 బాకీపడ్డ రేవంత్ సర్కార్

◆ ఎక్కడ పోయింది మీ తులం బంగారం, స్కూటీ హామీ/మహిళా దినోత్సవం లోపు హామీల అమలుపై కార్యాచరణ ప్రకటించాలి

◆ రేవంత్ రెడ్డి సర్కార్‌కి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరిక



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజాక్షేత్రంలో పోరాటాలు చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. మహిళా దినోత్సవంలోపు హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని చేయాలని అల్టిమేటం జారీ చేశారు.

మంగళవారం నాడు తెలంగాణ జాగృతి మహిళా విభాగం కార్యకర్తలతో తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. మహిళలకు ఇచ్చిన హామీల పై ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడం విషయంలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... కెసిఆర్ పాలనలో మహిళలకు పెద్దపీట వేశామని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. మాయ మాటలు చెప్పి, అబద్ధపు హామీలు ఇచ్చి మహిళలను రేవంత్ రెడ్డి మోసం చేశారని విరుచుకుపడ్డారు.

"ప్రతి మహిళకు నెలకు 2500 చొప్పున డబ్బులు అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గెలిచినా కూడా అమలు చేయకపోవడం దారుణం. 14 నెలల డబ్బు ? 35,000 కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బాకీ పడింది. మహిళా దినోత్సవం లోపు ఈ హామీని నెరవేర్చాలి" అని డిమాండ్ చేశారు.

కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ, ఆడపిల్లలందరికీ ఉచితంగా స్కూటీలు అందిస్తామన్న హామీలు ఏమయ్యాయని నిలదీశారు. మహిళలకు ఉచిత బస్సు పెట్టి మిగతా పథకాలను తుస్సుమనిపించారని ఎద్దేవా చేశారు. తాము మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణాన్ని స్వాగతిస్తున్నామని, కానీ ప్రభుత్వం మరిన్ని బస్సులు పెంచి ప్రజా రవాణాను సులభతరం చేయాలని సూచించారు.

కేవలం మహిళలనే కాకుండా అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. మహిళల పేరిట ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పి ఇంత వరకు ఆ ప్రక్రియనే మొదలుపెట్టలేదని ఎత్తిచూపారు. సంక్రాంతికి సన్నబియ్యం ఇస్తామని ఇప్పటికీ ఇవ్వకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పెన్షన్లను తక్షణమే నాలుగు వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

## కాంట్రాక్టులన్నీ ఖమ్మం జిల్లా మంత్రికే!

◆ డిప్యూటీ సీఎం 30% కమిషన్లు తీసుకొని పనులు చేస్తున్నారని సొంత పార్టీ ఎమ్మెల్యేనే చెప్తున్నారు

◆ కాంగ్రెస్ నాయకుల గల్లాలు పట్టుకుని కొట్టే రోజులు దగ్గర్లోనే ఉంది

◆ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు.



హైదరాబాద్: అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకుల గల్లాలు పట్టుకుని ప్రజలు కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా లేకపోయేసరికి ఎంతో నష్టపోయామన్న భావనలో తెలంగాణ ప్రజలు ఉన్నారన్నారు.

హైదరాబాద్ లోని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ ఇంట్లో ఖమ్మం జిల్లా నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి కేటీఆర్ హాజరయ్యారు. మొన్నటి ఖమ్మం వరదల సమయంలో అక్కడి ప్రజలకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ గుర్తుకొచ్చారని చెప్పారు.

బర్త్ డే ఫంక్షన్ లకు పోవడానికి హెలికాప్టర్ లను ఉపయోగిస్తున్న మంత్రులు, ఖమ్మం వరదలప్పుడు మాత్రం హెలికాప్టర్‌లు పంపలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, చేతకానితనానికి ఓ కుటుంబం వరదల్లో కొట్టుకుపోయిందని కేటీఆర్ ఆరోపించారు. 2014 తర్వాత ఖమ్మంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అసాధారణ అభివృద్ధిని చేసింది. పువ్వాడ అజయ్ లాంటి ఉత్సాహవవంతమైన నాయకుడు ఓడిపోవడం బాధాకరం.

తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చింది. ఖమ్మం జిల్లాలోని ప్రత్యేక రాజకీయ సమీకరణాల వల్ల బిఆర్ఎస్ కు కొంత నష్టం జరిగింది. ఓడిపోయినా కూడా ప్రజలకు కష్టం వస్తే బిఆర్ఎస్ నాయకులు గులాబీ దండు ఈ సంవత్సర కాలంగా ప్రజలకు అండగా ఉంది. ఖమ్మంలో వరదలు వస్తే ప్రజలకు పువ్వాడ అజయ్ గుర్తుకొచ్చాడు.

డిప్యూటీ సీఎంతో కలిపి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు. కానీ వరదల సమయంలో వాళ్లతో పైసా ఉపయోగం లేదు. ఒక కుటుంబం వరద నీళ్లలో చిక్కుకుంటే కనీసం హెలికాప్టర్ తెప్పించి కాపాడాలన్న సోయి మంత్రులకు లేదు. ఎమ్మెల్యేల బర్త్డేలకు ఇంకా వేరే పనికిమాలిన పనులకు మంత్రులు హైదరాబాద్ నుంచి కూతవేటు దూరానికి కూడా హెలికాప్టర్లలో పోతున్నారు. ప్రజలు తిడుతున్న తిట్లను వింటే పౌరుషమున్న ఎవడైనా బకెట్ నీళ్లలో దూకి చచ్చేవాడు. కానీ కానీ రేవంత్ రెడ్డికి రేశం లేదు కాబట్టి అన్ని దులుపుకొని తిరుగుతున్నాడు. మా స్కూటీ ఏమైందని కాలేజీ పిల్లలు కూడా పోస్ట్ కార్డు ఉద్యమం మొదలుపెట్టారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా లేకపోయేసరికి ఎంతో నష్టపోయామన్న భావనలో తెలంగాణలోని ప్రతి ఒక్కరూ ఉన్నారు.

ముఖ్యమంత్రి నియోజకవర్గం లోని పనులతో పాటు తెలంగాణలోని ప్రతి పని కాంట్రాక్టు కూడా ఇవ్వాళ ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రికే దక్కుతుంది. కాంట్రాక్టు మంత్రి, ఆయన కమిషన్ల కోసమే ముఖ్యమంత్రి పని చేస్తున్నారని నిన్న కొడంగల్ లో చెప్పా.. డిప్యూటీ సీఎం 30% కమిషన్లు తీసుకొని పనులు చేస్తున్నారని సొంత పార్టీ ఎమ్మెల్యేనే చెప్తున్నారు.

వ్యవసాయ మంత్రి రుణమాఫీ కాలేదని చెప్తే సీఎం మాత్రం మొత్తం రుణమాఫీ అయిందంటారు. ఇలా మంత్రులకి ముఖ్యమంత్రికి శృతి లేదు. ఫలితంగా తెలంగాణ అధోగతి పాలయింది. బీసీ సోదరులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. కెసిఆర్ చేపించిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీ జనాభా 51.5% ఉంటే రేవంత్ చేసిన కులగరణ సర్వేలో ఐదున్నర శాతం తగ్గించి 46% కి బీసీ జనాభాను చూపిస్తుంది.


కాంగ్రెస్ పార్టీ హనీమూన్ టైం అయిపోయింది. మహబూబ్నగర్ జిల్లాలో కళ్యాణ లక్ష్మి చెక్కులు ఇస్తున్న ఓ మంత్రిని తులం బంగారం లేదని మహిళలు ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల గల్లాలు పట్టి ప్రజలు కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. పోలీసులను అడ్డం పెట్టుకొని ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు స్థానిక సంస్థల్లో ఏకగ్రీవానికి కుట్రలు చేస్తున్నారు. ఈ కుతంత్రాలను గులాబీ దండు అడ్డుకుంటుంది. త్వరలోనే ఖమ్మం వస్తాను.



## 'ఆలపాటి' విజయానికి కృషి చేయండి

◆ ఎమ్మెల్యే కన్నా

రామకృష్ణాపురం, మహానాడు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రామకృష్ణాపురం గురుకుల పాఠశాల, కేంద్రీయ విద్యాలయం, ఫైర్ స్టేషన్ అధికారులు, ఏజీ కేఎం కళాశాల ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ, పరిశీలకుడు వేముల కొండ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టభద్రులు, గ్రాడ్యుయేట్స్ అందరూ మీఅమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటును కూటమి బలపరిచిన ఆలపాటి రాజాకి ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో



కూటమి ప్రభుత్వం కోసం ఏ విధంగా అయితే కృషి చేశారో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా రెట్టింపు స్థాయిలో కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



వినుకొండలోని ఈద్గా అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హామీ ఇచ్చారు. తిమ్మాయపాలెం రోడ్డులోని నమాజ్ కుంట వద్ద ఉన్న ఈద్గా అభివృద్ధికి సంబంధించి స్థానిక పట్టణ మతపెద్దలు, మర్కస్ మజిద్ ఏ అబూబకర్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం చీఫ్ విప్ జీవీ ఆంజనేయులను కలసి వినతిపత్రం అందించారు.

## ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు విజయాన్ని అందివ్వాలి

◆ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ విజ్ఞప్తి

మండెపూడి, మహానాడు: అమరావతి మండలంలోని మునుగోడు, మల్లాది, లింగాపురం, మండెపూడి పాఠశాలల టీచర్లను మంగళవారం పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కలిశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ప్రతి ఒక్క




గ్రాడ్యుయేట్ ఓటు వేయడమే కాకుండా ఇతరులు కూడా కూటమి అభ్యర్థికి ఓటు వేసేలా అభ్యర్థించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని తెలిపారు. అధికారం చేపట్టిన ఏడు నెలలకే కూటమి ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని చెప్పారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ని అత్యధిక మెజారిటీతో గెలిపించి శాసన మండలికి పంపాలని ఎమ్మెల్యే కోరారు.

## కొన్నిరోజులు చికెన్ తినొద్దు!

◆ బర్డ్‌ఫ్లూపై తెలంగాణ సర్కార్ అప్రమత్తం

హైదరాబాద్, మహానాడు:

బర్డ్‌ఫ్లూపై తెలంగాణ సర్కార్ అప్రమత్తమైంది. వ్యాధి వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర సరిహద్దుల్లో 24 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే మూడింటిని



TOP PRIORITY
IMMEDIATE

GOVERNMENT OF TELANGANA
ANIMAL HUSBANDRY, DAIRY DEVELOPMENT & FISHERIES (AH) DEPARTMENT

Memo No.493/AH-II(1)/2025 -3. Dated:08.02.2025

Sub:- Animal Husbandry Department – Highly Pathogenic Avian Influenza (HPAI) – Preparedness of the District to prevent ingress of Avian Influenza - Reg.

Ref:- From Animal Husbandry Commissioner, DO No. K11053/2/2021-LH, Department of Animal Husbandry and Dairying, Ministry of FAHD, Government of India New Delhi Dt.07.02.2025.

The attention of all District Collectors in the State is invited to the reference cited and inform that a highly pathogenic Avian Influenza (HPAI) is reported in other States of Country and Government of India has requested the States to strengthen the Bio-security Measures for preventing the spread of HPAI and protecting the poultry population.

2. The District Collectors are therefore requested to enhance awareness among the poultry farmers and stake holders and the public about the HPAI prevention and critical role of the bio-security measures and prevent transportation of sick birds, proper disposal of dead birds. They should be informed to bring any unusual deaths of poultry to the notice of staff in Veterinary and Animal Husbandry Department. District level meeting may be convened with Forest Department, Police Department, Health Department and Veterinary and Animal Husbandry Department to discuss the measures to be adopted to prevent the spread of the disease from other States into Telangana under intimation to Government.

SABYASACHI GHOSH
SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT

To
All the District Collectors in the State
Copy to:
1. The Director(FAC), Veterinary & Animal Husbandry, Telangana, Hyderabad
2. OSD to C.S. for information
SF/SC

// FORWARDED :: BY ORDER //

SECTION OFFICER

పెట్టింది. ఏపీ నుంచి తెలంగాణకు వస్తున్న కోళ్ల వాహనాలను అధికారులు వెనక్కి పంపుతున్నారు. రాష్ట్రంలో కొన్ని రోజులు చికెన్ తినవద్దని, కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది.

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 12, ఫిబ్రవరి 2025 ||

# వైసీపీ కార్యాలయానికి పోలీసుల నోటీసులు




**తాడేపల్లి:** వైసీపీ కార్యాలయానికి పోలీసులు మరోసారి నోటీసులు ఇచ్చారు. అగ్నిప్రమాదం సంభవించిన రోజున కార్యాలయానికి వచ్చిన నేతలు, సందర్శకుల జాబితాను ఇవ్వాలని, కార్యాలయం బయట పార్క్ చేసిన వాహనాల నంబర్లు, వాహనదారుల వివరాలు ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. దీంతోపాటు, సీసీ కెమెరాల డేటా స్టోర్ అయ్యే హార్డ్ డిస్క్ ను అందజేయాలని కోరారు.
ఈ నెల 5వ తేదీన వైసీపీ కేంద్ర కార్యాలయం వద్ద ఉన్న ఎండిపోయిన గడ్డికి మంటలు అంటుకున్నాయి. వెంటనే స్పందించిన సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అదే రోజున మళ్లీ మంటలు అంటుకున్నాయి.

తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయం వద్ద వరుసగా చోటు చేసుకున్న అగ్నిప్రమాదాలు కలకలం రేపుతున్నాయి. ఈ నెల 5వ తేదీన జరిగిన అగ్నిప్రమాదాలపై 6వ తేదీన పోలీసులకు వైసీపీ కార్యాలయ వర్గాలు ఫిర్యాదు చేశాయి. ఈ క్రమంలో ఘటనకు సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజీని అందజేయాలని వైసీపీ కార్యాలయానికి 7వ తేదీన పోలీసులు నోటీసులు ఇచ్చారు. అయితే, ఆ రోజున సీసీ కెమెరాలు పనిచేయలేదని, అందువల్ల ఫుటేజీ అందుబాటులో లేదని పోలీసులకు వైసీపీ కార్యాలయ వర్గాలు లేఖను ఇచ్చాయి.



## అర్జీల పరిష్కారంలో
# అలసత్వం వీడండి

- మంత్రులు, అధికారులు అందరూ దృష్టి పెట్టాలి
- అపరిష్కృత అర్జీలు లేకుండా చూసుకోండి
- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- మూడు జిల్లాల నుంచే అత్యధిక ఫిర్యాదులు

**అమరావతి, మహానాడు:** ప్రజల నుంచి అందిన అర్జీలు, ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించరాదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ ఎస్)పై ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై ఆయన మాట్లాడారు.

అర్జీలు ఏవీ కూడా అపరిష్కృతంగా ఉంచకుండా అన్నిటిని పరిష్కరించాలన్నారు. దీనిపైన మంత్రులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రధానంగా రెవెన్యూ విభాగం నుంచి ఎక్కువగా అర్జీలు వచ్చాయని, వాటి పరిష్కార మార్గాలు కనుగొనాలన్నారు. వచ్చిన ఫిర్యాదుల్లో ఆర్థికపరమైనవి, ఆర్థికేతరమైనవి ఎన్ని ఉన్నాయి, వ్యక్తిగత సమస్యలు ఏమున్నాయి అనేది తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్నారు.

కొంతమంది అధికారులు తమ వద్దకొచ్చిన అర్జీని కింది స్థాయి అధికారికో, పై స్థాయి అధికారికో బదిలీ చేసి చేతులు దులిపేసుకుంటున్నారని ఇలాంటి ధోరణిని ఎంత మాత్రం ఉపేక్షించబోమని తెలిపారు. ప్రజలు అర్జీలు ఇచ్చిన తర్వాత వాటిని క్షుణ్ణంగా పరిశీలించి ఆ సమస్యను పరిష్కరించదగ్గదైతే దాన్ని పరిష్కరించాలి లేదా అది పరిష్కారం కాదనే విషయాన్ని ఆ అర్జీ ఇచ్చిన వారిని పిలిచి వివరంగా చెప్పి అవగాహన కల్పించాలన్నారు. ఫిర్యాదులు పరిష్కారం చేయడంలో అవసరమైతే ఆయా శాఖల్లో సంస్కరణలు తీసుకురావాలన్నారు.

### ఉత్తరాంధ్ర, చిత్తూరు జిల్లాల నుంచే ఎక్కువ


శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, చిత్తూరు జిల్లాల నుంచే అత్యధికంగా అర్జీలు ఉన్నాయి. పల్నాడు, కృష్ణా జిల్లాల నుంచి అతి తక్కువ ఫిర్యాదులు వచ్చాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పీజీఆర్ ఎస్ గ్రీవెన్స్‌పైన ప్రజెంటేషన్ ఇచ్చారు. పీజీఆర్ ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల్లో టాప్ ఫైవ్‌లో ఉన్నవన్నీ కూడా రెవెన్యూ సంబంధిత అర్జీలే ఎక్కువ ఉన్నాయని ఆయన తెలిపారు.

ఇప్పటి వరకు మొత్తం 7,42,301 అర్జీలు వస్తే అందులో 60.7 శాతం పరిష్కారమయ్యాయని, 38.6 శాతం పరిష్కార క్రమంలో ఉన్నాయని, 0.87 శాతం ఫిర్యాదులు సమీక్షించాల్సి ఉందని చెప్పారు. రెవెన్యూలో మ్యుటేషన్లపైనే ఎక్కువగా 94,324 ఫిర్యాదులు వచ్చాయి. తర్వాత సర్వేసెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డులకు సంబంధించి 88,758, రెవెన్యూ రికార్డుల కరెక్షన్‌ల కోసం 71,059, పట్టాదారు పాసుపుస్తకాల కోసం 29,948 అర్జీలు వచ్చాయని చెప్పారు.

# వచ్చే ఏడాది జూన్ నాటికి 5 లక్షల ఇళ్లు పూర్తి చేయాలి

- సీఎం చంద్రబాబు ఆదేశం

**అమరావతి, మహానాడు:** లక్ష ఇళ్లను ఒకేసారి ప్రారంభిద్దాం. అర్బన్, రూరల్ హౌసింగ్ శాఖలు కలిసి ఐదేళ్లల్లో మొత్తం ఇళ్లు పూర్తి చేయాలి.





ఇళ్ళు లేనివారికి అర్బన్లో రెండు సెంట్లు, రూరల్లో 3 సెంట్లు కచ్చితంగా ఇవ్వాలని సీఎం అన్నారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో గృహ నిర్మాణ శాఖపై సీఎం మాట్లాడారు. సొంత స్థలం ఇవ్వడంతో పాటు ఇళ్లు కట్టుకోవడానికి డబ్బులు కూడా ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఇళ్ల విషయంలో ప్రభుత్వానికి స్పష్టమైన ఆలోచన ఉందన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ఇళ్లు కట్టారు. కానీ ఎవ్వరూ వెళ్లడం లేదు. అవ్వన్నీ అగ్గిపెట్టేలా ఉన్నాయి. కాబట్టి మొత్తం డేటా తీసుకోవాలని ఆదేశించారు. వ్యక్తిగత ఇళ్లను జియోట్యాగింగ్ చేయాలని సూచించారు. వైసీపీ వాళ్లు ఇచ్చిన ఇళ్లు నిర్మాణం జరిగి ఉంటే వాటినే లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి ఇళ్లు ఉండాలి. లేని వారికి ఐదేళ్లల్లో ఇళ్లు కట్టిస్తాం. ఇళ్లతో పాటు కరెంటు, నీళ్లు, గ్యాస్, సోలార్ తోపాటు అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు.

2029 నాటికి ఇళ్లు గ్యాస్, కరెంటు, నీళ్లు ఇలా ప్రజలకు అన్ని సదుపాయాలు కల్పిస్తామ న్నారు. 2014-19 ఇళ్లు ఇచ్చామని వాటిని నిధులు ఇవ్వడలేదని, కొంత మంది మధ్యలో నిలిపివేశారని వారికి ఏ విధంగా హెల్ప్ చేయాలో ఆలోచించాలని మంత్రి పార్థసారథి కోరారు. వాటిని 20లో కన్వర్ట్ చేయాలని కోరారు. ఇలాంటి వాళ్లు. 50 వేలు మంది ఉన్నారని చెప్పారు.

# మీ డబ్బే మీకు ఉరితాడు!

**తాత మనవడు !**

**వయొలెంట్ లవ్ స్టోరీ . దాసరి సినిమాకు సీక్వెల్ !**

తాతగారు !

ఏలూరు దగ్గర ... ఒక పల్లెటూళ్ళో... మధ్య తరగతి కుటుంబం లో జన్మించాడు .

ఆత్మ విశ్వాసం , కృషి , పట్టుదల ... ఇందనలుగా... అంచెలంచెలుగా ఎదిగాడు .

రతన్ టాటా తో కలిసి చదివాడు .

పారిశ్రామిక వేత్త అయ్యాడు .

కోట్లు గడించాడు.

ముగ్గురు కూతుళ్లు .. ఒక కొడుకు !

పిల్లలకు ఆస్తులు ఇచ్చాడు .

దాన కర్ణుడు .. తిరుమల కొండకు 50 కోట్లు ఇచ్చాడు .

తాను చదివిన పల్లె బడికి ... అయిదు కోట్లు ఇచ్చాడు .

వయసు 85 .

మనవడు !

డబ్బుల్లో పుట్టాడు . తల్లి... తండ్రి తో... విడిపోయింది .

విలాసాల్లో... విచ్చల విడిగా పెరిగాడు .

అడ్డుఅదుపు లేదు . మద్యానికి బానిస అయ్యాడు .

తాతగారి డబ్బు .. అమెరికా లో ఉన్నత విద్యాసంస్థలో సీట్ ఇప్పించింది .

డ్రగ్స్ పిచ్చి పట్టింది . .

ప్రేమ... అనురాగం... ఆప్యాయత ... విచక్షణ.. లాంటి మానవ భావోద్వేగాలు మచ్చుకైనా లేవు .నార్సిస్టిక్ పర్సనాలిటీ డిసార్డర్ .. ఆంటి సోషల్ పర్సనాలిటీ డిసార్డర్ .

ద్వేషం , పగ ప్రతీకారం .. .

తాతగారి కంపెనీ .

తాగుబోతు... తిరుగుబోతు... డ్రగ్స్ కు బానిస అయిన మనవడికి ... కంపెనీ డైరెక్టర్ పదవి ఇస్తే కంపెనీ అందులో పని చేసే ఉద్యోగులు నష్టపోతారు .తాను నాటిన చెట్టు తన కళ్ళముందే కూలి పోతుంది .

అందుకే తాతగారు ఆ పదవి ఈ మృగానికి ఇవ్వలేదు .

ఎంతైనా కూతరు కొడుకు కదా . మమకారం చావదు.బతకడానికి నాలుగు కోట్లు ఇచ్చాడు .

మనవడు !

నేరమయ నవ ప్రపంచానికి ప్రతినిధి .ఈ కాలం కుర్రాడు" తొక్కలో డబ్బుదేముంది . బ్రో . .. చిన్నప్పటి నుంచి తాను నోట్ల కట్టల్లో పెరిగాడు .

డబ్బు ఇచ్చే సుఖాలను అనుభవించడం తెలుసు .కృషి పట్టుదల శ్రమ సహానుభూతి లాంటివి తనకు ఒంటబట్ట లేదు .

వాటి అవసరమేముంది ? తాతగారు సంపాదించింది చాలదా ?

29 ఏళ్ళ వయసు వచ్చింది ..

ఇప్పుడు .. తనకు సమాజం లో గుర్తింపు , గౌరవం కావాలి . పెత్తనం చెలాయించాలి .

అదో తుత్తి. ఎంత సేపు తిని తొంగుంటే మడిషికి గొడ్డుకి తేడా ఏటుంటది ఇగో .. దాన్ని సాటిస్ఫాయి చెయ్యాలి సూట్ వేసుకొని బోర్డు మీటింగ్స్ కు వెళ్ళాలి .ఆర్డర్స్ ఇవ్వాలి . చప్పట్లు కొట్టించుకోవాలి. లీడర్ అని పించుకోవాలి .

తాత ఇచ్చిన నాలుగు కోట్లు ఓకే ." కానీ కంపెనీ కి డైరెక్టర్ చెయ్యమంటే ముసలోడు .. వినడే. ఎంత సేపు వాడు చెప్పిందే నడవాలా? ఎనభై ఏళ్ళు వచ్చినా అంత ఇగో నా ?నేనేంటో చూపుతా . దెబ్బకు అకౌంట్ సెటిల్ అయిపోవాలి . ముసలోడు చావాలి .. కుక్క చావు చావాలి . "

అందుకే కసి తీరా... పొడిచి... పొడిచి... చంపేశాడు .

ఒక్క సారి కాదు .. మెడ పై ... డజను సార్లు .. ఒంటి పై... డెబ్బై సార్లు... .. పొడిచి కసిగా... తనివి తీరా చంపేశాడు .

తల్లి అడ్డొచ్చింది .

" కొడుకంటే ప్రేమ లేదా ?

తనకు సమాజం లో గౌరవం వద్దా? ముసలాడి కి చెప్పొచ్చుగా ?





అందుకే . తాతను పొడిచిన కత్తితోనే .. తల్లిని కూడా పొడిచాడు .

ముసలాడు పోయాడు . తల్లి ఇప్పటికి బతికింది . తనను పోలీస్ లు పట్టుకొంటారని తెలుసు . అయితేనేమి? పగ ప్రతీకారం ముఖ్యం .

తనకు పదవి నివ్వని తాత చావాలి .తల్లి కూడా చావాలి . నవ మాసాలు మోయడం లాంటి తొక్కలో కబుర్లు వద్దమ్మా .తాగమా!.. డ్రగ్స్ తీసుకొన్నామా! .. ఎంజాయ్ చేశామా! ..

ఇదే జీవితం .

అవును నాకు జీవితం ఇదే నేర్పింది.

నేను ఈ కాలం కుర్రాడిని . ".

నిజ జీవిత కథలో నీతి.

ఆస్తులు సంపాదిస్తారు ..పిల్లలు... మనవలు ... మానవరాండ్రు... చల్లగా ఉండాలని ... వారి కష్టం కూడా మీరే పడుతూ ..వారికి కష్టం తెలియక .. కష్టపడాల్సిన అవసరం లేకుండా .. వారి బతుకు కూడా మీరే బతికేస్తారు .

డబ్బు సంపాదనలో మీరు ... .

డబ్బు కావాలి .డబ్బు సంపాదించాలి .నిజమే .

కానీ బాలన్స్ తెలియాలి గా? ..

పిల్లకు కేవలం డబ్బే ఇచ్చి .. .. మీ సమయం ఇవ్వక .. పెంచితే ?

వారు మృగాలు అవుతారు .రాక్షసులు అవుతారు .

తప్పెవరిది ?

మీ అమ్మ నాన్న మిమ్మల్ని ఇలాగే పెంచారా ?

డబ్బు ఇవ్వకపోయినా వారు... మీకు సమయం ఇచ్చారు . ప్రేమ... అనురాగం... ఆప్యాయత నేర్పారు .

మరి మీరు ?

చంద్రునిలో కుందేలు ఉందని మీరు మాత్రమే విన్నారు . గోరు ముద్దలు తిన్న.. అనగనగా తో... మొదలెట్టి కంచికి కి చేరే దాక ... కథలు విన్న ... చివరి తరం మీది .

" ఈ కాలం యువత... సెల్ ఫోన్ కు... నీలి చిత్రాలకు... మద్యానికి... డ్రగ్స్ కు బానిస అని మీ పెద్దలు అంటున్నారు .మీరు మాత్రం సంపాదన వ్యసనపరులు కాదా ? స్టేటస్ పిచ్చి మీకు లేదా ?మా బాల్యాన్ని దోచిన దొంగలు ఈరు కదా ? మీరున్నది ఒక తీరు .. మమ్మల్నే తప్పు పడుతారు ఎందుకు ?"

... యువ ఘోష .

మీరు సంపాదించిన డబ్బు .. దిండు కింద నాగు !

చేతిలో డబ్బు .. ఇంట్లో ... తల్లితండ్రి ప్రేమ కరువు ... . చెడు సావాసాలు .

.. చెడిపోరా ?

అసలు మంచి- చెడు అంటే ఏంటో వారికి బాల్యం లో నేర్పారా ?డబ్బు తో చదువు కొన్నారు .కారు కొన్నారు . బంగాళా కొన్నారు .కానీ .. మానవత్వాన్ని కొనగలరా ?

మీకు డబ్బే ముఖ్యం .అందుకే మీ డబ్బే మీకు ...ఇప్పుడు... ఉరితాడు .

మానవత్వం నేర్వని నేటి కుర్రరికం ..డబ్బు పిచ్చి పట్టిన పెద్దరికం పై పగ తీర్చుకొంటోంది .

అయ్యో పెద్దాయనా!

మధ్య తరగతి నేపథ్యం .. డబ్బు పెద్దగా లేకపోవడం .. మీలో కసి పెంచింది . కష్టించి పని చేసేలా చేసింది . నాయకత్వ లక్షణాలు అలవాటు చేసింది .

తరం మారింది . కూతురు మీ ఇంట్లో ఉంది . కొడుకును ఎలా పెంచిందో చూడు !

వాడి పెంపకం .. కుటుంబ నేపథ్యం .. విలాసాలకు బానిస చేసింది . పాజిటివ్ భావోద్వేగ లక్షణాలు చంపేసింది . ఏంటి నీకు ఈ శిక్ష పెద్దాయనా !

డబ్బు సంపాదించాలి .

నిజమే . అంత కంటే పిల్లల్ని ఎలా పెంచాలో నేర్వాలి .వారితో టైం గడపాలి . వివాహ కుటుంబ వ్యవస్థలను గౌరవించాలి .

**- అమర్నాథ్ వాసిరెడ్డి**

# శివాలయానికి సేవ చేయడం వలన కలిగే విశేష ఫలితాలు

శివరాత్రి రోజూగానీ, వారానికోసారి కానీ, ఏదైనా పండుగలు, ఉత్సవాలు జరిగే సమయంలో ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకుని తిరిగి వచ్చేస్తాం. ఏవైనా మొక్కుబడులు ఉంటే తీర్చుకుంటాం.

అక్కడ విశేషమైన ఆర్జిత సేవలు జరిపించుకుంటాం. అవకాశాన్ని బట్టి అక్కడి ఇతర ఆలయాలను, సందర్శనీయ స్థలాలను దర్శిస్తాం. క్షేత్రంలో నిద్రచేస్తాం. అంతవరకే చాలా మందికి తెలిసిన విషయం. భక్తులకు తెలియాల్సిన మరో విషయం ఏంటంటే ఆలయంలో ఎన్నో సేవలను మనం స్వచ్ఛందంగా నిర్వహించవచ్చు. అలా చేస్తే కలిగే ఫలితం చాలా విశేషంగా చెప్పబడింది.

శివాలయం నిర్మాణం చేస్తే.. నిర్వహణ చేస్తే.. పునరుద్ధరణ చేస్తే ఎంతైతే ఫలితం ఉంటుందో దానితో సమానమైన ఫలితాలు శివాలయ సేవ ద్వారా పొందవచ్చని శివధర్మశాస్త్రంలో వివరించబడింది.

### దర్శిస్తే చాలు..

దూరం నుండి ఆలయశిఖరాన్ని దర్శించిన వెంటనే నమస్కరించాలి. అలా చేస్తే ఏడుజన్మలలో తాను చేసిన పాపాలనుండి వెంటనే విముక్తుడౌతాడు.

### పరిశుభ్రం చేస్తే...

శివాలయానికి వెళ్లిన భక్తులు అక్కడ ఏవైనా ప్రాణులు, పశువులు తిరుగుతుంటే వాటిని హింసించకుండా బయటకు పంపి మెత్తటి మార్జని (చీపురు)తో ఆలయాన్ని తుడిచి పరిశుభ్రం చేస్తే చాంద్రాయణ వ్రతం ఆచరించిన ఫలితం కలుగుతుంది.

### ఆవు పేడతో అలికితే...

ఆవు పేడతో ఆలయాన్ని శుభ్రంగా అలికితే కూడా ఎంతో ఫలితం ఉందని చెప్పబడుతోంది. ఆ ఆవు పేడను మంచి ఆవుల నుండి సేకరించాలి. తన ఇంటినుంచి తీసుకురావాలి లేదా పవిత్రమైన చోటునుండి తేవచ్చు.

ఆ గోమయాన్ని కూడా పైభాగం, కిందభాగం వదిలి మధ్యలో శుద్ధం, మలినం కాని ఆవుపేడనే తీసుకోవాలని స్పష్టంగా చెప్పడం జరిగింది. అలాంటి గోమయంతో శివాలయ పరిసర ప్రాంతాన్ని చక్కగా అలికితే తమ పూర్వీకులు తరించి గోలోకం చేరుకుంటారు. అంతేకాక అలా చేస్తే సిరిసంపదలతో తులతూగుతారు.

నీటితో శుభ్రపరిస్తే..

వస్త్రంతో వడగట్టిన నీటితో ఆలయాన్ని పరిశుభ్రం చేసినవారు సజ్జనులు. అతడు యోగియై శివుని చేరుకుంటాడు. అలాగే శివాలయం నేలను అద్దంలా.. అంటే నేలవైపు చూస్తే, తన ప్రతిబింబం కనపడేలా తుడిచినా ఎంతో గొప్ప ఫలితం ఉంటుంది.

### పూలతో అలంకరిస్తే...

శివాలయాన్ని రకరకాల పుష్పాలతో అలంకరించినా.. అందంగా తీర్చిదిద్దినా...ఎంత ప్రదేశం తీర్చిదిద్దాడో దాన్ని అంగుళాలతో



కొలిచి అంతకాలం రుద్రలోకంలో నివసిస్తారని చెప్పబడుతోంది. పుష్పవనాలను పాదుగొల్పినా... శివలోకం చేరతాడు.

### శివరూపాలను చిత్రిస్తే..

చిత్రకారులను రప్పించి వారితో శివాలయంలో వేదపురాణాలలో పేర్కొనబడిన శివుని అవతారాలు, లీలలకు సంబంధించిన చిత్రాలు వేయించాలి.అలా ఎన్ని బొమ్మలు చిత్రిస్తారో అంతకాలం రుద్రకాలంలో గొప్పగా ప్రకాశిస్తారు.

### వెల్ల వేయిస్తే...

శివాలయానికి, ప్రాకారం గోడలకు సుధాకర్మ (సున్నం పూయించడం) చేయించినవారికి ఆలయనిర్మాణం చేసిన వారితో సమానమైన పుణ్యం లభిస్తుంది. అలాగే ప్రతి సంవత్సరం విడువకుండా, పాలవంటి తెల్లసున్నంతో లేదా వేరే రంగులతో అందంగా వెల్లవేయించినా అతడికి శివలోకవాసపుణ్యం లభిస్తుంది.

అలాగే ఆలయంలోని గోడలకు సుగంధాలు పూయడం, గుగ్గిలంతో ధూపం వేయడం, చక్కగా రంగురంగుల ముగ్గులు పెట్టడం, పూలతోటలను బాగుచేయడం, ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తీసివేయడం,

దీపాలకు కావాల్సిన వత్తులను సిద్ధం చేయడం, తోటి భక్తులకు సాయం చేయడం, ఆలయంలో భక్తులకు మంచినీరు ఇవ్వడం, ప్రసాదవితరణ ఇలా ఎన్నో సేవలను భక్తులు ఆచరించవచ్చు.

ఈ అవకాశం మనం గ్రామాల్లో ఉండే ఎన్నో ఆలయాల్లో మనం నిర్వహించుకుంటే ప్రతీ దేవాలయం దివ్యమైన భవ్యమైన శోభతో, అలరారుతుంది. భక్తులకూ కల్పవృక్షమై నిలుస్తుంది

డిజిటల్ న్యూస్ పేపర్

బుధవారం 12, ఫిబ్రవరి 2025

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

## డిజిటల్ మీడియాలో ..

# జయహో "మహానాడు"

# 3,21,041

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1న ప్రారంభమైన మన

మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న

మా అభిమాన పాఠకుల

అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్

మార్తి సుబ్రమణ్యం

సంపాదక సారధ్యంలో





బోడెపూడి సుబ్బారావు (BSR)

సారధ్యంలో



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

08

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 12, ఫిబ్రవరి 2025 ||

# మల్లయోధుడుతో రామ్‌చరణ్

రామ్‌చరణ్ నటించిన తాజా చిత్రం 'గేమ్ ఛేంజర్'. ఆశించిన స్థాయిలో ఆ చిత్రం విజయం సాధించలేదు. ప్రస్తుతం ఆయన బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. జాన్వీ కపూర్ నాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఏఆర్. రెహమాన్ స్వరాలు అందిస్తున్న ఈ చిత్రం ఇటీవల హైదరాబాద్‌లో మరో షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది.

ఇప్పటి వరకు దాదాపుగా 25 రోజులు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాను వీలున్నంత త్వరగా పూర్తిచేసి దసరాకు లేదా వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని నిర్మాతలు యోచిస్తున్నారు. ఇందుకోసం దర్శకుడు పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. పీరియాడిక్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో రూరల్ రూటెడ్ కథగా రూపొందుతున్న ఈ చిత్రంలో రామ్‌చరణ్ మల్లయోధుడుగా కనిపిస్తారని తెలిసింది. మనందరికి తెలిసిన తెలుగు గర్వం, గొప్ప మల్లయోధుడు కోడి రామ్మూర్తి నాయుడుకు ఈ సినిమా కథకు సంబంధం ఉందని సమాచారం.

ఈ చిత్రంలో రామ్‌చరణ్ కూడా కోడి రామ్మూర్తి నాయుడు ప్రేరణతో, ఆయన పుట్టిన ఊరు శ్రీకాకుళంలోని వీరఘట్టంలోనే పుట్టి ఆయన అడుగుజాడల్లోనే మల్లయోధుడుగా శిక్షణ పొంది, కుస్తీల పోటీలో భారతదేశం తరపున పాల్గొంటాడని తెలిసింది. ఈ చిత్రంలోని యాక్షన్ సన్నివేశాలను ప్రపంచ ప్రఖ్యాత ఫైట్‌మాస్టర్‌తో రూపొందిస్తున్నారట.



'పెద్ది' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతోన్న ఈ చిత్రానికి దాదాపుగా ఇదే టైటిల్‌ను ఖరారు చేస్తారని అంటున్నారు.




## 'సంక్రాంతికి వస్తున్నాం'ని సెలబ్రేట్ చేసుకోవడం చాలా ఆనందంగా వుంది: విక్టరీ వెంకటేష్

విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి, మోస్ట్ సక్సెస్ ఫుల్ బ్యానర్ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పొంగల్ బ్లాక్ బస్టర్ 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని గ్రాండ్ గా నిర్మించారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్ గా నటించారు. సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో చార్ట్ బస్టర్ మ్యూజిక్ ఇచ్చారు. జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం అందరినీ అద్భుతంగా అలరించి, అత్యధిక వసూళ్ళు సాధించిన మొదటి తెలుగు రిజినల్ చిత్రంగా చరిత్ర సృష్టించి సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది.

ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ విక్టరీ వేడుకని నిర్వహించింది. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు ఈ వేడుకకు అతిధిగా హాజరయ్యారు. డైరెక్టర్ హరీష్ శంకర్, వశిష్ట, వంశీపైడిపల్లి స్పెషల్ గెస్ట్ లు గా హాజరయ్యారు. ఈ వేడుకలో నిర్మాతలు చిత్ర యూనిట్ తో పాటు ఎగ్జిబిటర్స్ డిస్ట్రిబ్యూటర్స్ కి షీల్డ్స్ అందించారు. విక్టరీ వేడుకలో విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ.. ఇండస్ట్రీ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ 'సంక్రాంతికి వస్తున్నాం'ని సెలబ్రేట్ చేసుకోవడం ఆనందంగా వుంది. ఓ మంచి దేవుడా.. నేను అడగకుండానే కలియుగ పాండవులు సినిమా ఇచ్చావు. నేను అడగకుండానే చాలా హిట్లు ఇచ్చావు. చంటి లాంటి సినిమా ఇచ్చి పెద్ద బ్లాక్ బస్టర్ చేశావు(నవ్వుతూ) ప్రేమించుకుందాం రా, బొబ్బిలిరాజా, సీతమ్మవాకిట్లో, గణేష్, లక్ష్మీ,తులసి, రాజా ఇలా ఎన్నో ఇచ్చావు.

2000లో మళ్ళీ ఒక ఇండస్ట్రీ హిట్ కలిసుందాంరా ఇచ్చావ్. 2025లో ఏం ఆడకుండా సైలెంట్ గా ఇంత పెద్ద బ్లాక్ బస్టర్ ఇచ్చావు. ఇది కలా నిజమా తెలియడం లేదు. అభిమానులు ప్రేక్షకులు ఇండస్ట్రీలో వున్నవారంతా కోరుకోవడం వలనే ఇది సాధ్యపడిందని భావిస్తున్నాను. ఇంత పెద్ద బ్లాక్ బస్టర్ ఇచ్చిన అందరికీ థాంక్ యూ. ఈ సినిమా బిగినింగ్ నుంచి చాల ఎంజాయ్ చేశాను. మా గురువు గారు రాఘవేంద్రరావు మంచి ఫ్యామిలీ ఫిల్మ్ చేయ్ పెద్ద హిట్ అవుతుందని చెప్పేవారు. ఆయన నమ్మకం నిజమైయింది. నా ఫ్యాన్స్ ఫ్యామిలీ ఆడియన్స్ ఈ సినిమా చాలా గొప్పగా ఆదరించారు. మీ ప్రేమ అభిమానం ఎప్పుడూ కావాలి. పదేళ్ళుగా సినిమా చూడని ఆడియన్స్ కూడా థియేటర్స్ కి వెళ్లి ఈ సినిమా చూడటం చాలా ఆనందాన్ని ఇచ్చింది. అనిల్ అద్భుతమైన పనితీరు కనబరిచాడు, 2027లో మళ్ళీ సంక్రాంతికి వస్తాం. రికార్డులు కాదు.. మంచి ఎంటర్ టైన్మెంట్ ఫిలిమ్స్ తో ఆడియన్స్ ఎంజాయ్ చేసేలా చూడటం నాకు ఇష్టం. అందరికీ థాంక్ యూ' అన్నారు.




## కన్నప్ప' నుంచి 'శివా శివా శంకరా' పాట

డైనమిక్ హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా 'కన్నప్ప' చిత్రాన్ని అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద డా. మంచు మోహన్ బాబు భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ఈ మూవీకి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఏప్రిల్ 25న ఈ మూవీని ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే కన్నప్ప టీం ప్రమోషన్స్‌ను మరింతగా పెంచేసింది. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా కన్నప్ప నుంచి ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో శ్రీ శ్రీ రవి శంకర్ గురూజీ చేతుల మీద ఈ పాటను విడుదల చేశారు. బెంగుళూరులోని శ్రీ శ్రీ రవిశంకర్ గారి ఆశ్రమంలో డా.మోహన్ బాబు, విష్ణు మంచు, దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్, కన్నడ డిస్ట్రిబ్యూటర్ రాక్‌లైన్ వెంకటేష్, నటి సుమలత, భారతి విష్ణువర్ధన్, సంగీత దర్శకుడు స్టీఫెన్ దేవస్సీ, నటుడు అర్పిత్ రాంకా, రామజోగయ్య శాస్త్రితో సహా కన్నప్ప బృందంతో ఈ పాటను రిలీజ్ చేశారు. 'ఈ చిత్రం భక్తిశ్రద్ధలతో కూడినది, మా మొదటి పాటను శ్రీ శ్రీ రవిశంకర్ గురూజీ ఆవిష్కరించడం నిజంగా మా అదృష్టం' అని కన్నప్ప టీం తెలిపింది. కన్నప్ప నిర్మాత డా. మోహన్ బాబు మాట్లాడుతూ..'శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ ఈ పవిత్ర గీతాన్ని ఆవిష్కరించడం గౌరవంగా భావిస్తున్నాను. కన్నప్ప అనేది శివునితో మమేకం చేయబడిన చిత్రం. ఇదే మా ప్రయాణానికి అపారమైన ఆధ్యాత్మిక విలువను జోడిస్తుంది' అని అన్నారు.'శివా శివా శంకరా' అంటూ సాగే ఈ పాటను విజయ్ ప్రకాష్ ఆలపించారు.

## 'లైలా' పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైనర్ : డైరెక్టర్ రామ్ నారాయణ్

మాస్ కా దాస్ విశ్వక్సేన్ యూనిక్ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లైలా' ఎక్సయిటింగ్ ప్రమోషనల్ కంటెంట్‌తో స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రానికి రామ్ నారాయణ్ దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. ఆకాంక్ష శర్మ హీరోయిన్ గా నటిస్తోంది. పాటలు చార్ట్ బస్టర్ హిట్



అయ్యాయి. లైలా ఫిబ్రవరి 14న బిగ్ స్క్రీన్స్ లో విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ రామ్ నారాయణ్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

**లైలా ఐడియా ఎప్పుడు వచ్చింది ? ప్రాజెక్ట్ ఎలా స్టార్ట్ అయ్యింది ?**

బట్టల రామస్వామి బయోపిక్ సినిమా చేశాను. అది 2021లో రిలీజై మంచి హిట్ అయ్యింది. ఈ సినిమా తర్వాత ఓ యూనిక్ కథ చేయాలనుకున్నాను. హీరో లేడి గెటప్ వేయడం యూనిక్ కాన్సెప్ట్. ఈ మధ్య అలాంటి కథలు రాలేదు. క్యారెక్టరైజేషన్ కుదిరితే అద్భుతంగా వస్తుంది. బ్యూటీపార్లర్ లో పని చేసే మేల్ క్యారెక్టర్ ని పెడితే లాజికల్ గా జస్టిఫికేషన్ వస్తుందనే ఆలోచన కథ రాయడం మొదలుపెట్టాను. ఓల్డ్ సిటీ బ్యాక్ డ్రాప్ నాకు చాలా ఇష్టం. ఆ బ్యాక్ డ్రాప్ లో సినిమా బాగా కుదిరింది. ఇది పెర్ఫెక్ట్ ఎంటర్ టైనర్.

హీరోని వెదకడం చాలా ఛాలెంజ్ గా అనిపించింది. ఈ క్యారెక్టర్ చేయడానికి చాలా గట్స్ కావాలి. లాస్ట్ హోప్ గా విశ్వక్ గారు ఓకే చేశారు. విశ్వక్ ఒప్పుకోవడం సాహు గారి గ్రేట్ నెస్. విశ్వక్ కి మాస్ ఇమేజ్ వుంది. కథ చెప్పినపుడు తను ఎలా తీసుకుంటారో అనే భయం వుండేది. విశ్వక్ కి ఇలాంటి లేడీ గెటప్ చేయాలని కోరిక వుండేది. ఇంతకుముందు రెండు కథలు విన్నారట. ఈ కథ ఆయనకి బాగా కనెక్ట్ అయ్యింది. విశ్వక్ రావడంతో ప్రాజెక్ట్ నెక్స్ట్ లెవల్ కి వెళ్ళింది.

**ట్రైలర్ చూస్తే బోల్డ్ నెస్ ఎక్కువైయిందని అనిపిస్తోంది?**

ఇందులో వల్గారిటీ వుండదు. నాటీనెస్ వుంటుంది. ఈ కథకు ఆ నాటీనెస్ కావాలి. విజువల్ గా సినిమా చాలా క్లీన్ గా వుంటుంది. క్లాస్ మాస్ ఫ్యామిలీ ఆడియన్స్ అందరూ ఎంజాయ్ చేసేలా వుంటుంది.

**విశ్వక్‌కి లేడి గెటప్ కోసం ఎలాంటి వర్క్ చేశారు ?**

లేడి గెటప్ అంటే మాకూ భయమే. అయితే రెమో సినిమాకి ప్రోస్తటిక్ చేసిన నిక్కీని సంప్రదించాం. విశ్వక్ లేడి గెటప్ లో అదిరిపోతారని నిక్కీ చెప్పడంతో మాకు ఇంకా నమ్మకం వచ్చింది. మేము ముందు ఎఐ లో క్రియేట్ చేసి చూసుకున్నాం. తర్వాత లుక్ టెస్ట్ చేశాం. ఫస్ట్ లుక్ రిలీజ్ చేసినప్పుడు అవి విశ్వక్ కళ్ళు కాదని చాలమంది అనుకున్నారు. నిజానికి అవి ఆయన కళ్ళే. నా దగ్గర ఒరిజినల్ ఫొటోస్ కూడా వున్నాయి.

**ఇందులో మదర్ ఎమోషన్ వుందని విన్నాం ?**

అవును.సోనూ మోడల్ కి ఆ పార్లర్ అంటే ఎందుకు అంత ఇష్టం అనేది చాలా ఎమోషనల్ గా వుంటుంది. కామెడీ యాక్షన్ రోమాన్స్ ఎమోషన్ అన్నీ వుంటాయి. విశ్వక్ సినిమా నుంచి ఏం ఆశిస్తామో అందుకు పదిరెట్లు ఎక్కువగా వుంటుంది.

**ఇందులో విశ్వక్ రెండు పాటలు రాశారు కదా ?**

అవును. ఆయన లిరిక్స్ కూడా రాస్తారా అని నాకు తెలీదు. ట్యూన్ పంపిన తర్వాత తను ఓ పాట వినిపించారు. ఎవరు రాశారని అడిగాను. నేనే అని చెప్పారు. తను అప్పటికప్పుడే రాసేస్తాడు. లియోన్ జోన్స్ మంచి మ్యూజిక్ ఇచ్చాడు. తనకి విశ్వక్ కి మంచి సింక్ వుంది. అది ఈ సినిమాకి ప్లస్ అయ్యింది. రిచర్డ్ ప్రసాద్ బ్యూటీఫుల్ విజవల్స్ ఇచ్చారు. ఆయన చాలా విజనరీ కెమరామ్యాన్.

**విశ్వక్‌లో డైరెక్టర్ కూడా వున్నాడు కదా.. అది మీకు హెల్ప్ అయ్యిందా?**

-ఖచ్చితంగా ప్లస్ అవుతుంది. ఒక నటుడికి అన్నీ తెలిసుంటే చాలా హెల్ప్ అవుతుంది. డైరెక్టర్ చాలా ఫ్రీ అయిపోతాడు. తన విజన్ నాకు చాలా ఇష్టం. చాలా మంచి పాజిటివ్ గా ఈ జర్నీ జరిగింది.

**కామాక్షి క్యారెక్టర్ గురించి ?**

మేము ఇంకా ఆ క్యారెక్టర్ రివిల్ చేయలేదు. చాలా స్పెషల్ క్యారెక్టర్. సినిమా చూసి 'వావ్' అంటారు. అద్భుతంగా నటించారు. చాలా సపోర్ట్ చేశారు.

**లైలా టైటిల్ గురించి ?**

ఇందులో సోను మోడల్ లైలా..ఈ రెండు క్యారెక్టర్స్‌పై కథ నడుస్తుంది. లైలా ఈ సినిమాకి యూఎస్పీ. లైలా వచ్చిన తర్వాత స్క్రీన్ పై మ్యాజిక్ వుంటుంది. అందుకే సినిమాకి లైలా యాప్ట్ టైటిల్. లైలా గెటప్ లో విశ్వక్ చూసి వారి ఫ్యామిలీ చాలా సర్ ప్రైజ్ అయ్యారు. ఈ క్యారెక్టర్ కోసం చాలా కష్టపడ్డారు. ఆయన కష్టానికి తగిన ఫలితం వస్తుంది. ఇందులో కామాక్షి, ఆకాంక్ష, అభిమన్యు సింగ్ క్యారెక్టర్స్ కూడా చాలా కీలకంగా ఉంటాయి. ఇందులో అభిమన్యు సింగ్ కామెడీని చాలా ఎంజాయ్ చేస్తారు. ఆకాంక్ష ది జిమ్ ట్రైనర్ క్యారెక్టర్. తను మంచి డ్యాన్సర్. వారి కెమిస్ట్రీ చాలా బ్యూటీఫుల్ గా వుంటుంది.

## సింగిల్ కాదు మింగిల్ అవ్వాలనుకుంటున్నా

పదేళ్ల క్రితం రన్ రాజా రన్ సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ సీరత్ కపూర్. బాలీవుడ్‌కి చెందిన ఈ అమ్మడు టాలీవుడ్‌లో మొదట్లో వరుసగా సినిమాల్లో నటించింది. కపూర్ బ్యూటీ అనే ట్యాగ్‌తో టాలీవుడ్‌లో మంచి ఆఫర్లు దక్కించుకుంది. కానీ ఆమె నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద పెద్దగా విజయాన్ని సొంతం చేసుకోలేక పోవడంతో ఆఫర్లు తగ్గుతూ వచ్చాయి. సోషల్ మీడియాలో అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా రెగ్యులర్‌గా వార్తల్లో నిలిచే సీరత్ కపూర్ అడపా దడపా సినిమాల్లో ఆఫర్లు దక్కించుకుంటూనే ఉంది. తాజాగా ఈ అమ్మడు హైదరాబాద్‌లో సందడి చేసింది. కరోనా సమయంలో నేరుగా ఓటీటీలో వచ్చిన 'కృష్ణ అండ్ హీజ్ లీల' సినిమాను థియేట్రికల్ రిలీజ్‌కి ప్లాన్ చేశారు. త్వరలో 'ఇట్స్ కాంప్లికేటెడ్' అనే టైటిల్‌తో థియేటర్‌ల ద్వారా రాబోతున్న సినిమా ప్రమోషన్ కోసం సీరత్ కపూర్ మీడియా ముందుకు వచ్చింది. సిద్దు జొన్నలగడ్డకు జోడీగా సీరత్ కపూర్ ఆ సినిమాలో నటించిన విషయం తెల్సిందే. సినిమాను థియేటర్‌లో చూడటం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని సీరత్ కపూర్ చెప్పుకొచ్చింది. అదే సమయంలో మీడియా వారు.. ఈ వాలెంటైన్స్ డే ప్లాన్ ఏంటి అని ప్రశ్నించిన సమయంలో సరదా సమాధానం చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచింది. వాలంటైన్స్ డే ప్లాన్స్ ఏం లేవని, ప్రస్తుతం తాను సింగిల్‌గా ఉన్నాను. మింగిల్ కావడానికి ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పుకొచ్చింది. వాలంటైన్స్ డే రోజు ఎవరైనా రోజా ఫ్లవర్ ఇస్తే తీసుకోవడానికి రెడీ అన్నట్లు చెప్పుకొచ్చింది. సింగిల్‌గా ఉన్న సీరత్ కపూర్ వచ్చే వాలంటైన్స్ డే వరకు అయినా మింగిల్ కావాలని కోరుకుంటున్నాం అంటూ సోషల్ మీడియా ద్వారా చాలా మంది ఆమె అభిమానులతో పాటు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

హీరోయిన్స్ లో ఎక్కువ శాతం మంది సింగిల్‌గా ఉండరు. రహస్య ప్రేమాయణం సాగిస్తూ ఉంటారు. కానీ సీరత్ కపూర్ మాత్రం సింగిల్ అని క్లీయర్‌గా చెప్పేసింది. తర్వాత సైఫ్ మొదటి స్పందన సినిమా ఇండస్ట్రీలో మొదట అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా కెరీర్‌ను ప్రారంభించింది.

నటిగా, మోడల్‌గా, డాన్సర్‌గా ఎన్నో రకాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న సీరత్ కపూర్ బాంద్రాలోని నేషనల్ కాలేజీలో ప్రీ యూనివర్శిటీ కోర్సును పూర్తి చేసింది. మాస్ కమ్యూనికేషన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేయాలని అనుకుంది. కానీ నటనలో బిజీ కావడంతో డిగ్రీని మధ్యలోనే వదిలేసింది. ఎప్పటికైనా తన డిగ్రీని పూర్తి చేయాలని కోరుకుంటున్నాను అంటూ గతంలో ఒక ఇంటర్వ్యూలో సీరత్ కపూర్ చెప్పుకొచ్చింది.



Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144